RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

| హైదరాబాద్ | 17 జనవరి 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:191 |
|---|---|---|---|---|---|

# సదర్మాట్ బ్యారేజీకి పి.నర్సారెడ్డి పేరు పెడతాం

## రేవంత్‌రెడ్డి




## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి.



వార్తా 2 లో

## సదర్మాట్ బ్యారేజ్ ద్వారా వేల ఎకరాలకు సాగునీరు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 16, 2026 – నిర్మల్ జిల్లా నిర్మల్ జిల్లా మామడ మండలం పొన్కల్ గ్రామ సమీపంలో నిర్మించిన సదర్మాట్ బ్యారేజీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సదర్మాట్ బ్యారేజీ ద్వారా వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. 2016 అక్టోబర్‌లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును 676.592 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించగా, ఇందుకోసం 1,176 ఎకరాల భూమిని సేకరించారని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ ద్వారా నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ మండలాల్లో 12 వేల ఎకరాలు, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ ప్రాంతాల్లో 5 వేల ఎకరాలు కలిపి మొత్తం 18,016 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో కడెం, ఖానాపూర్, కోరుట్ల మండలాల్లోని 34 గ్రామాల వ్యవసాయ భూములకు సాగునీరు అందనుందని వివరించారు. పాత సదర్మాట్ అనికట్, గంగానాలా ఆయకట్టు స్థిరీకరణకు 1.58 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నీటిని సాగు అవసరాలకు అనుగుణంగా విడుదల చేస్తామని తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుబంధు, రైతు భరోసా, రుణమాఫీ వంటి పథకాలతో పాటు, పంట ఉత్పత్తులను కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యులు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసులో సుప్రీంకోర్టు

### .స్పీకర్‌కు ఇదే చివరి అవకాశం..

### తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా



న్యూ డిల్లీ జనవేరి 16 ;ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై శుక్రవారం విచారణ జరిపిన ధర్మాసనం.. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. స్పీకర్ కంటి ఆపరేషన్ చేయించుకున్నారని.. అలాగే సెక్రటరీ జనరల్ మారారని తెలిపారు. దీనివల్ల జాప్యం జరుగుతోందని.. మిగిలిన ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని తెలిపింది. స్పీకర్‌కు చివరి అవకాశం ఇస్తున్నామని.. రెండు వారాల్లో మిగతా ఎమ్మెల్యేలపై కూడా నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత వేటుపై తీసుకున్న చర్యలపై రెండు వారాల్లో అఫిడవిట్ ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది

## జైపాల్ రెడ్డి 84 వ జయంతి సందర్భంగా నక్లెస్ రోడ్ లో ని వారి సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులు అర్పించిన రేవంత్ రెడ్డి





**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** దివంగత మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి 84 వ జయంతి సందర్భంగా నక్లెస్ రోడ్ లో ని వారి సమాధి స్ఫూర్తి స్థల్ వద్ద నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిహాజరైన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి,పొన్నం ప్రభాకర్ ,జూపల్లి కృష్ణా రావు,ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ఎంపీ లు,ఎంఎల్ ఏ లు,ఎంఎల్సీ లు,జైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులు.

ప్రజాబలం

17 జనవరి 2026 శనివారం


# యుద్ధానికి దారి తీస్తున్న సంక్షోభం

ఇరాన్ నిరసనల సంక్షోభం యుద్ధానికి దారితీస్తోంది.అమెరికా సైనికులు ఇరాన్ దిశగా కదులుతున్నాయి. ఇరాన్ ప్రతీకార చర్యలు ప్రకటించింది. నిరసనల్లో హింసకు దిగిన ఇరాన్‌పై ట్రంప్ గట్టి సూచనలు జారీ చేశారు. ఇప్పుడు అది సైనిక చర్యలుగా మారనుంది. పశ్చిమాసియా స్థావరాల నుంచి భారీ ఎయిర్‌ఫోర్స్ ఇరాన్ లక్ష్యంగా ఉంది.యూఎస్ బేసుల నుంచి యుద్ధ విమానాలు, డ్రోన్లు, ఇంధన ట్యాంకర్లు ఇరాన్ వైపు బయలుదేరాయి. ఇది దాడి సిద్ధతలకు స్పష్టమైన సంకేతం. ప్రాంతీయ ఉద్రిక్తత మరింత పెరిగింది.అమెరికా చర్యలకు ఇరాన్ తిరుగుబాటు పన్నుతుంది. దాడి వస్తే తిరిగి ఒడ్డుబాటు చేస్తామని హెచ్చరించింది. ఇది ఉభయకాలీన యుద్ధ ఆకర్షణలకు దారి తీసే అవకాశం.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో పెద్ద సంఘర్షణకు దారితీయవచ్చు. ఇరాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభంతో 20 రోజులుగా దేశ ప్రజలు నిరసనలతో హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. వీటికి అమెరికా మద్దతు తెలుపుతోంది. మరోవైపు నిరసనలను ఇరాన్ అణచివేస్తోంది. ఇప్పటికే 2 వేల మందికిపైగా మరణించారు. ఈ క్రమంలో అమెరికా ఇరాన్‌పై దాడికి సిద్ధమవుతోంది. అయితే దాడి తీవ్రతపై ఇంకా స్పష్టత లేదు. ఖతార్‌లోని అల్?ఉదెయిద్ వైమానిక బేస్‌తో పాటు పలు ప్రాంతీయ స్థావరాల నుంచి సిబ్బందిని ఆపాద్ చేస్తోంది అమెరికా. ఇరాన్ రక్షణ చర్యలు చేపట్టింది. భారత్,బ్రిటన్ తమ దేశ పౌరులను వెనక్కి రావాలని సూచించాయి.ఆందోళనల సమయంలో మృతుల సంఖ్య 2,571కి చేరింది. ప్రజలు భయంతో రాత్రులు గడుపుతున్నారు. భద్రతా సిబ్బందిలోని సుమారు 100 మందికి సామూహిక అంత్యక్రియలు జరిగాయి. నిరసనకారులపై ఇరాన్ చర్యలు తప్పుబట్టి ట్రంప్ మానవత్వం చూపాలని కోరారు. లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. జాతీయ భద్రతా సమావేశాల్లో ఇరాన్ వ్యూహాలు చర్చించారు.ఇరాన్ జ్యుడీషియరీ ప్రధాని ఘోలామ్ హుసేన్ మొహ్సెనీ?ఎజీ, ఆందోళనకారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలస్యం వల్ల ప్రభావం తగ్గుతుందని అన్నారు. మరణశిక్షలు విధించేందుకు సిద్ధమవుతోంది టెహ్రాన్. మరోవైపు ఇంటర్నెట్ బ్లాక్ చేసిన ఇరాన్‌లో ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ ఉచిత సేవలు అందిస్తోంది. ఉపగ్రహాల ద్వారా పౌరులు బయటి ప్రపంచంతో కనెక్ట్ అవుతున్నారు.పరిస్థితులు తీవ్రతరం కావడంతో భారత్ తన పౌరులకు ఇరాన్ వదిలి వెళ్లాలని సూచించింది. కొత్తగా ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది. అక్కడ 10 వేల మందికిపైగా భారతీయులు ఉన్నారు.అమెరికా మిత్రరాజ్యాలు అలర్ట్‌లో ఉన్నాయి. ఇరాన్ ఆర్థిక, సైనిక ఒత్తిడులు పెరిగ్తున్నాయి. అంతర్జాతీయ మధ్యవర్తిత్వం అవసరమవుతుంది. అమెరికాతో ఏడాదిగా సన్నిహితంగా కొనసాగుతున్న పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ ఇప్పుడు ఇరుకున పడుతున్నారు. ఇటీవలే హమాస్‌ను అంతం చేయడానికి పాలస్తీనాలో యూఏఈ సైన్యంతో కలిసి పాల్గొనాలని డొనాల్డ ట్రంప్ పాకిస్తాన్ పీల్డ్ మార్షల్‌ను ఆదేశించారు. పాకిస్తాన్ ప్రజలకు పాలస్తీనాతో సత్సంబంధాలు సానుభూతి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా, హమాస్‌కు వ్యతిరేకంగా రంగంలోకి దిగడం పాకిస్తాన్ సైన్యానికి సవాల్‌గా మారింది. దీనిపై తర్జనభర్జన పడుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు ట్రంప్ నుంచి మళ్లీ కీలక ఆదేశాలు అందాయి. ఇరాన్‌పై యుద్ధానికి సిద్ధమవుతున్న తరుణంలో పాకిస్తాన్‌కు చెందిన 30 వేల మంది సైనికులను ఇరాన్ సరిహద్దులో మోహరించాలని నిర్ణయించినట్లు సమాచారం.పాకిస్తాన్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌కు అమెరికా అధికారుల నుంచి ఫోన్ కాల్ వచ్చిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌లో అమెరికా?ఇజ్రాయిల్ కూటమి ఏదైనా భూ ఆపరేషన్‌లకు మద్దతుగా ఈ చర్య ఉండవచ్చని వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల మధ్యప్రాచ్యలో ఇజ్రాయిల్?ఇరాన్ మధ్య ఘర్షణలు తీవ్రమైన స్థితిలో ఉన్నాయి, ఇది ప్రాంతీయ భద్రతకు సవాలుగా మారింది.ఈ పరిణామాలు భారతదేశానికి కూడా ప్రభావం చూపవచ్చు. పాకిస్తాన్ ఇరాన్ సరిహద్దులో శ్రద్ధ పెంచడం వల్ల భారత్?పాకిస్తాన్ సరిహద్దులపై ఒత్తిడి తగ్గవచ్చు. అయితే, అమెరికా ప్రభావంతో పాకిస్తాన్ మధ్యప్రాచ్య విషయాల్లో ఎక్కువగా జోక్యం చేసుకుంటే, దక్షిణాసియాలో బలాబలాలు మారుతాయి. భారత్ తన రక్షణ వ్యూహాలను మళ్లీ పరిశీలించాల్సి వస్తుందిఅమెరికా?ఇజ్రాయిల్ కోఆర్డినేషన్ పెరిగితే, ఇరాన్‌పై భూ దాడుల అవకాశం ఉంది. పాకిస్తాన్ ఈ సందర్భంలో తన సరిహద్దులను రక్షించుకోవడమే కాకుండా, మిత్రరాజ్యాలకు సహాయం చేయవచ్చు. ఇది చైనా, రష్యా వంటి ఇరాన్ మిత్రులతో ఉద్రిక్తతలను పెంచవచ్చు. ప్రపంచ శాంతి కోసం ఐక్యరాష్ట్ర సమితి జోక్యం అవసరం.ఇరాన్‌పై యుద్ధం మొదలైతే చమురు ధరలు పెరగవచ్చు, ఇది భారత్‌లో ఇన్‌ఫ్లేషన్‌కు కారణమవుతుంది. పాకిస్తాన్?అమెరికా బంధాలు బలపడతాయి, ఇరాన్‌తో ఉద్రిక్తతలు పెరుగుతాయి. బాలూచిస్తాన్ వంటి ప్రాంతాల్లో తిరుగుబాట్లు పెరిగే అవకాశం ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ 2.0 ప్రారంభించేందుకు అనువైన సమయం.ఈ చర్యలు మధ్యప్రాచ్య యుద్ధానికి దారితీయవచ్చనే ఆందోళనలు పెరుగుతున్నాయి. పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకునేలా అమెరికా ఒత్తిడి చేసిందా అనేది ఇంకా స్పష్టంగా లేదు.

# రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం రేవంత్ రెడ్డి







**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** రైతు అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు.

శుక్రవారం భోరజ్ మండలం హాతిగట్ గ్రామంలోని చనాక-కోరాట పంప్ హౌస్ హౌస్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి లతో కలిసి బటన్ నొక్కి ప్రారంభించి, లోయర్ పెన్ గంగ ప్రాజెక్టు ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని, రైతు అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆదిలాబాద్ అడవుల జిల్లా వర్షాధార వ్యవసాయ సాగు చేస్తుందని, ప్రజల త్రాగునీరు, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. సంవత్సరాలుగా పెండింగ్ ఉన్న ప్రజల సుదీర్ఘ స్వప్నం పెన్ గంగ ప్రాజెక్టును సాకారం చేసిందని తెలిపారు.

ప్రభుత్వం 1 వేయి 891 కోట్ల రూపాయల వ్యయంతో పరిపాలన అనుమతులు మంజూరు చేయగా 5.12 టి.ఎం.సి. లా నీటిని వినియోగించుకునే విధంగా చనాక కొరాటా బ్యారేజీతో పాటు పెన్ గంగ ప్రాజెక్టు రూపకల్పన చేయబడిందని, ఈ ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్, బీంపూర్, జైనథ్, బేల మండలాలలోని 89 గ్రామాలలో 51 వేల ఎకరాలకు సాగునీరు, ఈ ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించే విధంగా ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో ఆయకట్టుకు నీటిని అందించేందుకు డి14 నుండి డి19 గల ఉప కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, ప్రాజెక్టులు భాగంగా నీటిని నిల్వ చేసేందుకు పిప్పలకోటి బ్యాలెన్సింగ్ జలాశయం నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. చనాక కొరాటబ్యారేజ్ కు అనుబంధంగా ప్రధాన కాలువ, మోటార్లతో పంపు హౌస్ పనులు కొనసాగుతున్నాయని, తాంసి, భీంపూర్ మండలాలలోని 15 గ్రామాలలో గల 13 వేల 500 ఎకరాల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకువచ్చేందుకు 368 కోట్ల రూపాయలతో పరిపాలన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. లోయర్ పెన్ గంగ ప్రాజెక్టుకు అనుబంధంగా ప్రధాన కాలువ 47 కి.మీ. నుండి 89.90 వరకు, డిస్ట్రిబ్యూటరీ కాలువలు డి14 నుండి డి26 వరకు, పిప్పల్ కోటి నిల్వ జలాశయం నిర్మాణం ద్వారా తాంసి, బీంపూర్, ఆదిలాబాద్, జైనథ్, బేల మండలాలలో గల 75 గ్రామాలలో 51 వేల నూతన ఆయకట్టును వృద్ధిలోకి తీసుకురావడం కొరకు 1 వేయి 227 కోటి రూపాయలు పరిపాలనాపరమైన అనుమతులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అభివృద్ధి పనులకు గాను 3 వేల 313 ఎకరాల భూ సేకరణ అవసరం ఉండగా ఇప్పటివరకు 1 వేయి 545 ఎకరాల భూమి సేకరించి 117 కోట్ల రూపాయలు వెచ్చించడం జరిగిందని తెలిపారు. ప్రధాన కాలువ నిర్మాణంలో భాగంగా 138 కట్టడాలు చేపట్టడం జరిగిందని, సాత్నాల నదిపై 1.675 కిలోమీటర్ల మేర నిర్మించిన ప్రీకాస్ట్ పోస్ట్ టెన్షన్డ్ వయాడక్ట్ కొరకు 259.81 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఉపకాలవల నిర్మాణం చేపట్టి నూతన ఆయకట్టు విస్తీర్ణాన్ని పెంపొందించడంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో వ్యవసాయ సాగు విస్తీర్ణాన్ని పెంపొందించి రైతు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

అంతకుముందు హెలిప్యాడ్‌కు వద్ద జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఎంపీ గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, బోథ్ శాసన సభ్యులు అనిల్ జాదవ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

అనంతరం పంపు హౌస్ వద్ద పోలీసు గౌరవ వందనం స్వీకరించి, ఫోటో స్టాల్ ను సందర్శించారు. నీటి విడుదలకు సంబంధించిన వివరాలను కలెక్టర్, నీటిపారుదల శాఖ అధికారులు ముఖ్యమంత్రికి, మంత్రులకు తెలియజేశారు.

తదుపరి నాగోబా ఆలయ కమిటి సభ్యులు జాతరకు రావాలని ముఖ్యమంత్రి, మంత్రులను కలెక్టర్, ఎస్పీ లతో కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి ఆహ్వానించి నాగోబా ప్రతిమ గల మెమోంటో ను కలెక్టర్, ఎస్పీ అందజేశారు.

ఈ కార్యక్రమాలలో అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, ఆర్డీఓ స్రవంతి, ఎమ్మెల్సీ దండే విఠల్, జిసిసి చైర్మన్ తిరుపతి, గ్రంథాలయ చైర్మన్ నర్సయ్య, నీటిపారుదల శాఖ ఎస్ఈ విశ్వ కళ్యాణ్, విద్యుత్, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ, పర్యవేక్షణతో నిధుల మంజూరు.**

**వేములవాడలో రాజన్న ఆలయ విస్తరణ, మేడారంలో సమ్మ క్కసారలమ్మ గద్దెల పునర్నిర్మాణం.**

**మేడారం దర్శనానికి వెళ్లే ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీ.**

**వేములవాడ భీమన్న ఆలయంలో ప్రత్యేక పూజలు, కోడె మొక్కు చెల్లింపు.**






**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయసీతక్క గురువారం సాయంత్రం వేములవాడలోని శ్రీ భీమేశ్వర వసతి గృహానికి చేరుకున్నారు. మంత్రి రాక సందర్భంగా వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి, రాజన్న ఆలయ ఈవో రమాదేవి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి పూల మొక్కను అందజేశారు. మంత్రి సీతక్క గురువారం రాత్రి వేములవాడ రాజన్న ఆలయ వసతి గృహములో విశ్రమించారు. శుక్రవారం ఉదయం మంత్రి సీతక్క స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయల అభివృద్ధి, విస్తరణ పనులను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని తెలిపారు. వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి ముందుగా భీమేశ్వరాలయంలో కోడె మొక్కులు చెల్లించుకొని, భీమేశ్వర స్వామికి మంత్రి ప్రత్యేక పూజలు చేయగా, గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేసి, వేదొక్త ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం స్వీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రులు పొన్నం ప్రభాకర్ గౌడ్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, ముఖ్యమంత్రి, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. 150 కోట్ల రూపాయలతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయి అని పేర్కొన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు. అలాగే మేడారంలో సమ్మ క్కసారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా, 200 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసి రానున్న తరాలకు ఆదివాసీల చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు. ఈనెల 18వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, మేడారంలోనే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 19వ తేదీన మేడారం జాతర పనులను ముఖ్యమంత్రి, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తల్లులను దర్శించుకోవాలని ఆమె కోరారు. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ. ప్రభుత్వ విప్ ఆది ఈ సందర్భంగా మాట్లాడుతూ150 కోట్ల రూపాయల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామివారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఈ ప్రాంతం పై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని పేర్కొన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కులు చెల్లించుకునే ముందు వేములవాడకు భక్తులు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆలయ ఈ ఓ రమాదేవి, వేములవాడ ఏ ఎస్ పి రిత్విక్ సాయి, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, వేములవాడ అర్బన్ తాసిల్దార్ విజయప్రకాష్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సదర్మాట్ బ్యారేజికి పి. నర్సారెడ్డి పేరు పెడతాం.

## సబ్బండ వర్గాల అభివృద్ధియే ప్రజాప్రభుత్వం ప్రధాన ధ్యేయం:

## బాసరలో విశ్వ విద్యాలయ ఏర్పాటుకు చర్యలు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి.








**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాబలం ప్రతినిధి** జనవరి 16, 2026– నిర్మల్:– సబ్బండ వర్గాల అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శుక్రవారం నిర్మల్ పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా నూతన రేషన్ కార్డులు అందివ్వడంతోపాటు, ఆడపడుచులకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి ఎన్నో రకాల పథకాలతో రాష్ట్ర ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా, మహిళా సంఘాల సభ్యులను వెయ్యి బస్సులకు యజమానులను చేశామని గుర్తు చేశారు. వెయ్యి కోట్ల రూపాయల విలువైన భూమిని హైదరాబాద్ నడి బొడ్డున మహిళా సంఘాలకు కేటాయించి, వారి ఉత్పత్తులను విక్రయించేందుకు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. దేశంలోనే తెలంగాణ రా(ష్టాన్ని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. జిల్లా ప్రజల కోరిక మేరకు బాసరలో యూనివర్సిటీను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇందుకోసం అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తామని వెల్లడించారు. ఇండ్లు లేని పేదలకు నిలువ నీడ కల్పించేందుకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. రైతులకు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని వివరించారు. అదిలాబాద్ జిల్లాలో పదివేల ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక వాడను నెలకొల్పుతామని చెప్పారు. దీని ద్వారా జిల్లా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లాతో సమానంగా నిర్మల్ జిల్లాకు నిధులు కేటాయించి జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. చనక కొరాట, సదర్మాట్ బ్యారేజీల ద్వారా వీడు భూములు సస్య శ్యామలమవుతాయని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సంఘాలకు రుణాల చెక్కులను ముఖ్యమంత్రి, మంత్రులు, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లు కలిసి అందించారు. నిర్మల్ ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు.

**రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తాం: రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి.**

రాష్ట్రంలోని రైతాంగానికి సంపూర్ణంగా సాగునీరు అందిస్తామని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యమని అన్నారు. తుమ్మిడి హెట్టి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి సాగునీరు అందిస్తామని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ప్రాజెక్టులన్నింటిని ఆధునికరిస్తామని వివరించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మిగిలి ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తిచేస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేదవారికి అందరికీ నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు: జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు.**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పేదల ఉన్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇల్లు లేని పేద వారందరికీ సొంతింటి కలను నెరవేర్చాలన్న ఉద్దేశంతో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించామని చెప్పారు. అంతకుముందు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. **నిర్మల్ శాసనసభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ,**

జిల్లాలోని ప్రాజెక్టులన్నింటినీ ఆధునీకరించాలని కోరారు. నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని తెలిపారు. జెడ్పి భవన నిర్మాణం తో పాటు, రోడ్లు, వంతెనల నిర్మాణాలు మరమ్మత్తులు చేయాలని చెప్పారు. నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి అవసరమైన మేర నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దండే విటల్, అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 18న పాలేరుకు సీఎం రేవంత్ రెడ్డి











## రూ. 362 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

## చారిత్రక ఘట్టం మేడారంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ: మంత్రి పొంగులేటి

**ఖమ్మం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం)** ఏదులాపురం మున్సిపాలిటీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాత ఉమ్మడి జిల్లాల పర్యటనలో భాగంగా ఈ నెల 18న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ. 362 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని తెలిపారు.పాలేరు గడ్డపై అభివృద్ధి పందుమద్దులపల్లిలో జేఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపన, నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవం చేయడంతో పాటు.. మున్నేరు–పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ పనులను సీఎం ప్రారంభిస్తారు. అదేవిధంగా మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ ను ప్రారంభిస్తారు. అలాగే కూసుమంచిలో నిర్మించిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొంటారని వివరించారు.

ఇదే వేదికగా రాబోయే మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సన్నద్ధతపై ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యకర్తలతో సీఎం దిశానిర్దేశం చేయనున్నారని పొంగులేటి తెలిపారు.తొలిసారిగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీరాష్ట్ర చరిత్రలో నిలిచిపోయేలా ఈ నెల 18న మేడారంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్ మీటింగ్) నిర్వహించనున్నట్లు పొంగులేటి ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎన్నడూ లేని విధంగా హైదరాబాద్ వెలుపల క్యాబినెట్ భేటీ జరగడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు. ꞉꞉గత ప్రభుత్వంలా ఎన్నికల వేళ బొమ్మలు చూపడం మా అలవాటు కాదు..

నిరంతరం ప్రజల మధ్య ఉంటూ పనిచేసే ప్రభుత్వమిది꞉꞉ అని స్పష్టం చేశారు.కుంభమేళాకు మించి మేడారం ఏర్పాట్లుసమ్మక్క–సారలమ్మ జాతరను కుంభమేళా కంటే అద్భుతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని మంత్రి తెలిపారు. మేడారంలో కాకతీయుల నాటి వైభవం ఉట్టిపడేలా నిర్మించిన రాతి కట్టడాలను 19వ తేదీ ఉదయం ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు.

అలాగే గడువు ముగిసిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు త్వరలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు

# సంపత్ అక్రమాలపై విచారణ జరిపే దమ్ముందా.. సీఎం రేవంత్ రెడ్డికి క్రిశాంక్ సవాలు




హైదరాబాద్ జనవరి 16 ;ఏఐసీసీ నేత సంపత్ కుమార్ ప్రెస్‌మీట్లు పెట్టి అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ విమర్శించారు. సంపత్ కుమార్ చేసింది మొత్తం మట్టి దందాలే అని తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో క్రిశాంక్ మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ భ్రమర కాంట్రాక్టర్లును బెదిరించి రూ.8 కోట్లు డిమాండ్ చేశారని తెలిపారు. దీనిపై శ్రీ భ్రమర కాంట్రాక్టర్లు ఫిర్యాదు చేశారని.. దానిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు.మారణాయుధాలతో తమను బెదిరించారని శ్రీభ్రమర కాంట్రాక్టర్లు ఫిర్యాదులో పేర్కొన్నారని మన్నె క్రిశాంక్ తెలిపారు. కాంట్రాక్టులు రావాలంటే రూ.8కోట్లు ఇచ్చుకోవాలని బెదిరించారని తమ ఫిర్యాదులో వివరించారని పేర్కొన్నారు. సంపత్ అక్రమాలపై వెంటనే సిట్ విచారణ ప్రకటించాలని రేవంత్ సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో సంపత్ కుమార్ అన్నీ తప్పులే సమర్పించారని తెలిపారు. భూముల వివరాలపై తప్పుడు అఫిడవిట్ సమర్పించారని పేర్కొన్నారు. అసైన్డ్ భూములను సంపత్ కుమార్ తన సతీమణిపై రిజిస్ట్రేషన్ చేయించాడని తెలిపారు. సంపత్ కుమార్ అబ్బాయి అక్రమ కంపెనీ గ్లోబెన్ ఇండస్ట్రీస్‌కి డైరెక్టర్గా ఉన్నాడని అన్నారు. అక్రమ కంపెనీలతో కాంట్రాక్టులు దక్కించుకుంటున్నారని ఆరోపించారు. గ్లోబెన్ ఇండస్ట్రీస్‌కే అన్ని కాంట్రాక్టులు ఎందుకు వెళ్తున్నాయని ప్రశ్నించారు.మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా అక్రమాలకే పాల్పడుతున్నారని క్రిశాంక్ తెలిపారు. వంద పడకల ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కూడా జీతాలు ఇవ్వడం లేదని విమర్శించారు. మీడియా చానళ్లపై వేసిన సిట్‌లో సజ్జనార్‌ను పెడతారా? ఇంకో అధికారిని పెడతారా అని ప్రశ్నించారు. ఆ సిట్‌కు సంపత్ కుమార్ బెదిరింపు ఆడియో టేప్‌లను అందజేస్తామని తెలిపారు. కాంట్రాక్ట్ ఉద్యోగాల వివరాలను వెబ్‌సైట్లలో ఎందుకు పెట్టడం లేదని క్రిశాంక్ ప్రశ్నించారు. సంపత్ కుమార్ ఓకే అంటేనే కాంట్రాక్టు ఉద్యోగాలు ఇస్తున్నారని అన్నారు. ఉద్యోగాల లిస్ట్ ఎందుకు సంపత్ కుమార్ దగ్గరకు వెళ్తుందని ఆయన ప్రశ్నించారు. నిరుద్యోగ యువత సంపత్ కుమార్ అక్రమాలపై ఆలోచించాలని సూచించారు. సంపత్ కుమార్ క్విడ్ ప్రోకోలపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇసుక, మట్టి దందాలపై విచారణ జరగాలన్నారు. సంపత్ కుమార్‌పై విచారణ జరిపించే దమ్ము సీఎం రేవంత్ రెడ్డికి ఉందా అని అడిగారు. సంపత్ కుమార్ అక్రమాలపై విచారణకు రేవంత్ రెడ్డి రెడీనా అని సవాలు విసిరారు.

# ఏపీలో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు

కడప, జనవరి 17, రాయలసీమను రతనాలసీమ గా పేర్కొంటారు. ఖనిజ సంపదకు పెట్టింది పేరు కూడా. అందుకే ఖనిజాల కాణాచి అంటారు. చిత్తూరు, కర్నూలు, కడప, అనంతపురం జిల్లాల్లో ఖనిజ నిక్షేపాలు అధికం. రాయలసీమలో దొరికే ఖనిజ నిక్షేపాలకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని.. ఇది అత్యంత విలువ చేసే గని అని అమెరికా పరిశోధనల్లో తేలినట్లు ప్రచారం నడుస్తోంది. ముఖ్యంగా తిరుపతి జిల్లాలోని మంగంపేట బెరైటీస్ గనుల్లో అరుదైన పుల్లరిన్ ఖనిజా నిక్షేపాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలినట్లు సమాచారం. నానో టెక్నాలజీకి కీలకమైన పుల్లరిన్ వెలికి తీస్తే దేశ భవిష్యత్తే మారిపోతుంది. ప్రస్తుతం దీనిపైనే పెద్ద చర్చ నడుస్తోంది.సుమారు 18 సంవత్సరాల కిందట మంగంపేటగనుల్లో భారీగా పుల్లరిన్ నిక్షేపాలు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అప్పటినుంచి లోతైన అధ్యయనం కొనసాగుతోంది. పుల్లరిన్ అనేది కార్బన్ మిళితమైన ఓ పదార్థం. గోళ, స్థూపాకార ఆకృతుల్లో ఉండే ఖనిజం. అయితే ఇది ఉక్కు కంటే దృఢత్వంలో 2005 రెట్లు ఎక్కువ. పది రెట్లు తేలికైంది కూడా. అందుకే అమెరికా లోతైన పరిశోధనలు చేపట్టింది. మిగతా దేశాలు సైతం ఇప్పుడు అదే పనిలో ఉన్నాయి. మంగంపేట బెరైటీస్ గని పరిసరాల్లో మొత్తం 156 ప్రాంతాల్లో పెద్ద ఎత్తున నమూనాలు సేకరించి పరీక్షించారు. భువనేశ్వర్ లోని ఐఎంఎంటీ బృందం సైతం ఇక్కడ నమూనాలను సేకరించింది. కానీ తరువాత ఎందుకో సైలెంట్ అయింది.పుల్లరిన్ అనేది ప్రత్యేక ఖనిజం. ఎన్నో రకాల ప్రయోజనాలు దీని సొంతం. బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, పిడుగుపాటు నుంచి రక్షణకు విమానాలకు పైపూతగా దీనిని వాడుతారు. క్షిపణులకు ఈ పూత రాస్తే రాడార్లు కూడా పసిగట్టలేవు. ప్రధానంగా ఇంధన వాహకాల తయారీలో ఈ ఖనిజాన్ని ఎక్కువగా వినియోగిస్తారు. మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్స్, సోలార్ ఎనర్జీ టెక్నాలజీ పరంగాను దీనిని వాడుతారు. ఇంతటి ఈ ఖనిజంపై అమెరికా సీరియస్ గా పరిశోధనలు చేస్తోంది. సక్సెస్ అయితే ఈ ఖనిజం నిజంగా బంగారమే. ఈ దేశ తలరాతనే మార్చేస్తుంది.

# పదవీ గండం
# తెరపైకి కొత్త నేతలు

నెల్లూరు, జనవరి 17, కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్ల సమయం దగ్గరపడుతున్న కొద్దీ కొందరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా ఉంది. ప్రధానంగా ఇద్దరు మంత్రుల్లో టెన్షన్ ఎక్కువగా కనపడుతుంది.

ఇద్దరు మంత్రులు ఇప్పుడు ఏ విషయంలోనూ వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటి వరకూ కొంత మౌనంగా ఉన్నప్పటికీ త్వరలో జరిగే మంత్రి వర్గ విస్తరణలో తమ పదవికి గండం ఏర్పడుతుందనుకున్నారో.. ఏమో..ఈ ఇద్దరు మాత్రం తరచూ మీడియాలో కనిపిస్తున్నారు. ప్రధానంగా విపక్ష నేత వైఎస్ జగన్ పై విమర్శలు చేయడంలో వీరిద్దరూ ముందుంటున్నారు. నిన్న మొన్నటి వరకూ వంగలపూడి అనిత లేకుంటే.. నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు వంటి వారు మాత్రమే ఎక్కువ విమర్శలు చేసేవారు. ఇక నారాయణ సరేసరి.తాజాగా ఈ జాబితాలోకి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సవిత చేరిపోయారు. ఏవిషయంలోనూ వీరు వెనక్కు తగ్గకుండా తాము జగన్ ను విమర్శించడంలో ముందున్నామని చెప్పకనే చెబుతున్నారు. ఆనం రామనారాయణరెడ్డి దేవదాయ శాఖ కు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నిన్న మొన్నటి వరకూ ఆయన శాఖపై మాత్రమే స్పందించేవారు. కానీ మంత్రివర్గ విస్తరణలో ఆనం ను తప్పించి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి కానీ, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. మరొకవైపు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా మంత్రి పదవి ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెల్లూరు నుంచి ఆనంను తప్పించి వీరిలో ఒకరికి చంద్రబాబు కేబినెట్ లో స్థానం కల్పించే ఛాన్స్ ఉందన్న ప్రచారం తో ఆనం అలెర్ట్ అయినట్లు కనపడుతుందిఇక మరొక మంత్రి ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన సవిత కూడా ఈ మధ్య కాలంలో యాక్టివ్ గా ఉన్నారు. సవిత నిన్న మొన్నటి వరకూ పెద్దగా మీడియాలోకనిపించలేదు. బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న సవిత పదవికి గండం పొంచి ఉందని ప్రచారం జరుగుతుంది. అనంతపురం జిల్లాలో సీనియర్ నేతలున్నప్పటికీ వారిని కాదని కొత్తగా ఎమ్మెల్యేగా ఎన్నికైన సవితకు తొలిదఫా లో మంత్రి పదవి లభించింది. అయితే ఆమె కొన్ని వివాదాలకు కూడా కారణమయ్యారు. సవిత పనితీరుపై పార్టీ నాయకత్వం కూడా గత కొంత కాలంగా సంతృప్తి కరంగా లేకపోవడంతో ఆమెను కేబినెట్ నుంచి విస్తరణలో తప్పిస్తారని అంటున్నారు.

సవిత స్థానంలో కాల్వ శ్రీనివాసులు పేరు వినిపిస్తుంది. పయ్యావుల కేశవ్ ను అలాగే ఉంచి సవితను తప్పిస్తారన్న ప్రచారం పెద్దయెత్తున జరుగుతుండటంతో ఆఆమె కూడా ఇటీవల కాలంలో యాక్టివ్ అయ్యారు. మరి చివరకు చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాలి.

# కోట్ల రూపాయిల్లో పందేలు...

ఏలూరు, జనవరి 17, సంక్రాంతి పండగ రెండు రోజుల్లోనే బరుల్లో కోడి పందేలు జోరుగా జరిగాయి. కోడిపందేల్లో వందల కోట్లు చేతులు మారినట్లు సమాచారం. పెద్దయెత్తున భారీగా పందేలు కాయడంతో రెండు రోజుల్లోనూ వంద కోట్ల మేర బెట్టింగ్ లు జరిగాయని సమాచారం. రేపు కనుమ కావడంతో మరింతగా పందెంరాయుళ్లు రెచ్చిపోతారన్న అంచనాలు వినిపిస్తున్నాయి. క్రికెట్ గ్రౌండ్స్ ను మరిపించేలా కోడి పందేల బరులను ఏర్పాటు చేశారు. అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో పొరుగు రాష్ట్రాల నుంచి కోడి పందేలను వీక్షించేందుకు పెద్దయెత్తున జనం తరలి వచ్చారు. పోలీసుల ఆంక్షలు ఏమాత్రం పనిచేయలేదు. యధేచ్ఛగా పందేలు కొనసాగుతున్నప్పటికీ పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. ఒక్క ఉభయ గోదావరి జిల్లాల్లోనే రెండు వందలకు పైగానే బరులున్నాయి.ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ బరులు ఎక్కువగా ఈ ఏడాది ఏర్పాటు చేశారు. అయితే ఈసారి వరసగా నాలుగుసార్లు కోడిపందేల్లో నెగ్గిన కోడి యజమానికి బుల్లెట్ బండి బహుమతిగా ఇస్తున్నారు. ఫైనల్ విజేతకు ఇన్నోవా కారును బహుమతిగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. బరుల వద్దనే ఇన్నోవా కారును కూడా ఉంచి మొదటి బహుమతి గెలిచిన కోడి యజమానికి అందచేస్తామని ప్రకటించారు. చాలా బరుల్లో పాస్ లు ఉన్న వారికి మాత్రమే గ్యాలరీలోకి అనుమతి ఇస్తున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మరింత జోరుగా కోడి పందేలు జరుగుతున్నాయని చెబుతున్నార. తెలంగాణ నుంచి పెద్ద సంఖ్యలో జనం ఇక్కడకు క్యూకట్టారు. ఇతర జిల్లాలకుచెందిన వారు కూడా ఇక్కడకు తరలి వచ్చారు.బరులవద్దనే మంచి భోజనాన్నిఅందిస్తున్నారు. కోడికూర, మటన్ బిర్యానీ, రొయ్యల వేపుడు, చేపల పులుసు తో పాటు గోదావరి జిల్లాలకు చెందిన రుచులన్నీఅక్కడకు వచ్చిన వారికి అందిస్తున్నారు. ఇక మద్యం కూడా అక్కడే అందుబాటులో ఉంది. కాస్ట్ లీ మద్యం నుంచి నాసిరకం సరుకు వరకూ లభ్యమవుతుంది.ఖరీదైన కార్లు తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కనిపిస్తున్నాయి. ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ అత్యంత ఖరీదైన కార్లు కూడా బరుల వద్ద కనిపిస్తున్నాయి. అంతా క్యాష్ తోనే పందేలు కాస్తున్నారు. కొన్ని చోట్ల గూగుల్, పేటీఎం ద్వారా పే చేసే సౌకర్యం కల్పించినా ఎక్కువ మంది కరెన్సీ కట్టలనే తీసుకు వచ్చి పందేలు కాస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం ప్రాంతంలో జరిగిన ఒక బరిలో ఒక్క పందెంలో దాదాపు కోట్ల రూపాయలుచేతులు మారినట్లు తెలిసింది. కరెన్సీని లెక్కపెట్టేందుకు అక్కడకు మనీ కౌంటింగ్ మిషన్లు కూడా తెచ్చారు.

యుద్ధానికి ఆజ్యంపోసిన కోడి పందేలు

కేవలం గెలుపోటములే కాకుండా, పందెంలో గెలిచిన వారికి ఖరీదైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్‌ను బహుమతిగా ప్రకటించారు. దాంతో ఈ పోటీపై రాష్ట్రంలో అందరి దృష్టి నెలకొంది. రావులపాలెంలో ఏర్పాటు చేసిన ఈ బరిలో పోరు సాగింది. నిర్వాహకులు మొత్తం ఏడు పందేలను నిర్వహించగా, అందులో 5 పందేలు ఎవరు గెలిస్తే వారికి బుల్లెట్ బైక్ ఇస్తామని ప్రకటించారు. ఒక వర్గం అసాధారణ ప్రతిభను కనబరిచి 7 పోటీలకు గాను 6 పందేలలో విజయం సాధించి ఖరీదైన బుల్లెట్ బైక్‌ను సొంతం చేసుకుంది.విజేతగా నిలిచిన గ్రూప్ వారికి డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలుకూరి సతీష్ చేతుల మీదుగా రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బైక్ అందజేశారు. పందెం కోళ్ల పోరాటం చూసి, ఈవెంట్ హాజరైన వారు ఆశ్చర్యపోయారు. కోడి పందేలలో భూములు, ఏళ్ల తరబడిగా సంపాదించిన ఆస్తులు కోల్పోయిన వాళ్లు సైతం ఉంటారు.సంక్రాంతి పండుగ వేళ కోడి పందేల జోరు కనిపిస్తుంటుంది. అయితే, చరిత్రను గమనిస్తే వీటి కారణంగా యుద్ధాలు సైతం జరిగాయని తెలుస్తోంది. అందుకు ఉదహరణే మాచర్ల, గురజాల మధ్య జరిగిన పోరు. ఏపీలో ఎంతో ముఖ్యమైన పల్నాటి యుద్ధం ప్రారంభం కావడానికి కోడిపందెమే ప్రధాన కారణం అని తెలిసిన వారు ఆశ్చర్యపోతున్నారు. పల్నాటి చరిత్రలో మాచర్ల పాలకులకు బ్రహ్మనాయుడు, గురజాల పాలకులకు నాగమ్మ మంత్రులుగా ఉండేవారు. అయితే ఓ సందర్భంలో వీరు సరదాగా కోడి పందేలు వేసుకున్నారు. కొన్ని విభేదాలను పరిష్కరించేందుకు కోడి పందేలు నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఓడినవారు వనవాసం చేయాలని కండీషన్ పెట్టడంతో కోడి పందేల పోరు మరింతఉత్కంఠ రేపింది. మాచర్ల బ్రహ్మనాయుడుకు చెందిన కోడిపుంజు చిట్టిమల్లుడు, గురజాల నాగమ్మకు చెందిన కోడిపుంజు సివంగిడేగ బరిలో నిలిచాయి. హోరాహోరాగా జరిగిన కోడి పందెంలో సివంగిడేగ విజయం సాధించగా షరతు ప్రకారం ఓడిన బ్రహ్మనాయుడు వర్గం కొన్నేళ్లపాటు వనవాసానికి వెళ్తుంది. తిరిగివచ్చిన తరువాత షరతు ప్రకారం రాజ్యం తిరిగివ్వాలని కోరగా గురజాల నాగమ్మ వర్గం తరస్కరించడంతో పల్నాడులో యుద్ధం జరిగిందని చరిత్రకారులు పేర్కొన్నారు

# గుర్తు తెలియని పండ్లు తిని
# చిన్నారులకు అస్వస్థత

సంగారెడ్డి పటాన్చెరు నియోజకవర్గంలో విషాదం నెలకొంది. రామచంద్రాపురం పరిధిలోని బండ్లగూడ నేతాజీనగర్ లో నివసిస్తున్న బీహార్కు చెందిన ముగ్గురు చిన్నారులు (8)ఏళ్ల వయసు వారు సరదాగా సమీపంలోని అడవిలోకి వెళ్లారు. అక్కడ చెట్లకు ఉన్న కొన్ని గుర్తుతెలియని విషపు కాయలను వారు తిన్నారు. కొద్దిసేపటికే ఆ చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు వెంటనే స్పందించి వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు....

# విశాఖలో విభిన్న వాతావరణం...

విశాఖపట్టణం, జనవరి 17, అతి పెద్ద పండుగైన సంక్రాంతి సంబరాలకు సిద్ధమవుతున్న వేళ వాతావరణం ఏపీ ప్రజలను కలవరపెడుతోంది. రాష్ట్రం ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు బంగాళాఖాతాంలో పొంచి ఉన్న తుపాను ముప్పు కోస్తా తీరాన్ని భయపెడుతుంటే, మరోవైపు ఏజెన్సీ ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో కనిష్ట ఉష్ణోగ్రతలు గజగజ వణికిస్తున్నాయి. ఈ డబుల్ ఎఫెక్ట్ ప్రజలకు సవాల్‌గా మారింది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఇప్పుడు తీవ్ర రూపం దాలుస్తోంది. వాతావరణ శాఖ తాజా నివేదికల ప్రకారం, ఈ వాయుగుండం బలపడుతూ తుపానుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వాయుగుండం పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ శ్రీలంక వైపు ప్రయాణిస్తోంది. శుక్రవారం సాయంత్రం నాటికి ఇది శ్రీలంకలోని హంబన్‌తోట, బట్టికోల మధ్య తీరాన్ని దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం ఆంధ్రప్రదేశ్ తీరంపై ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు చర్చనీయాంశమైంది. దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. అయితే ఇది తుపానుగా మారిన పక్షంలో గాలుల వేగం గంటకు 60 నుంచి 100 కిలోమీటర్ల వరకు పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఉత్తర ఆంధ్ర, ఒడిశా, తమిళనాడు తీర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకే మత్స్యకారులు ఎవరూ సముద్రంలో వేటకు వెళ్లకూడదని, తీరని ప్రాంత ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సంక్రాంతి సమయంలో తుపానులు రావడం కొత్తేమీ కాదని వాతావరణ రికార్డులు చెబుతున్నాయి. 1891 నుంచి 2024 మధ్య కాలంలో సంక్రాంతి పండుగ సమయంలో సుమారు 12 సార్లు తుపానులు ఏర్పడినట్టు ప్రజలు గుర్తు చేస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే తరహా వాతావరణ పరిస్థితులు కనిపిస్తుండటంతో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలను ముమ్మరం చేశారు. పండుగ పూట వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట దెబ్బతినే అవకాశం ఉండటంతో రైతాంగం ఆందోళన చెందుతోంది. తుపాను గండం ఒకవైపు ఉంటే, అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత పరాకాష్టకు చేరింది. మన్యం ప్రాంతం మంచు దుప్పటిని కప్పుకుంది. ముఖ్యంగా పాడేరులో గురువారం ఉదయం కేవలం 4.1 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే చాలా తక్కువ. చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రాంతంలోని ఇతర జిల్లాల్లో కూడా పరిస్థితి ఇలాగే ఉంది. ఉదయం పది గంటల వరకు మంచు తెరలు వీడకపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చలి తీవ్రత పెరగడంతో గిరిజన ప్రాంతాల ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు.

# ఏపీలో నీళ్ల రాజకీయం...

విజయవాడ, జనవరి 17, తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు నీళ్ల రాజకీయాన్ని నమ్ముకున్నాయి. అయితే రెండు రాష్ట్రాల్లో చంద్రబాబును సాకుగా చూపి ఉద్యమాలకు శ్రీకారం చుడుతున్నాయి. చంద్రబాబుతో రాజీ పడి తెలంగాణ ప్రయోజనాలను గాలికి వదిలేసారని రేవంత్ పై మండిపడుతున్నారు గులాబీ పార్టీ నేతలు. తెలంగాణ సీఎం రేవంత్ తో రహస్య ఒప్పందం చేసుకొని ఏపీ ప్రయోజనాలను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడించి ఆపించానని తెలంగాణ అసెంబ్లీలో సీఎం రేవంత్ చెప్పుకొచ్చారు. అప్పటి నుంచి రచ్చ ప్రారంభం అయ్యింది. అయితే అది ముందుగానే నిలిచిపోయిందని.. రేవంత్ చెప్పిన దాంట్లో ఎంత మాత్రం నిజం లేదని గులాబీ పార్టీ నేతలు చెబుతున్నారు. తద్వారా జగన్మోహన్ రెడ్డి హయాంలో తామే ఆ పనులు ఆపించామని వారు చెప్పుకొస్తున్నారు. అయితే ఏపీలో వైసీపీ నేతలు మాత్రం తెలంగాణతో రాజీపడి రాయలసీమకు చంద్రబాబు ద్రోహం చేస్తున్నారని ఉద్యమ బాట పట్టేందుకు సిద్ధపడుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని జగన్ ఆలోచన చేశారు. తన పార్టీకి ఆయువుపట్టుగా భావించే రాయలసీమకు ప్రయోజనం కల్పించాలన్నది జగన్ టార్గెట్. కృష్ణా నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు అందించాలన్నది లక్ష్యం. అయితే సరిహద్దు జలాలకు సంబంధించిన నీటి వినియోగం కాబట్టి కచ్చితంగా అనుమతులు తీసుకోవాలి. అలా అనుమతులు తీసుకున్న తర్వాత ఈ భారీ ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి. కానీ జగన్మోహన్ రెడ్డి ఆ పని చేయలేదు. తద్వారా ప్రాజెక్టు పై ఆయనకు ఉన్న చిత్తశుద్ధి అర్థం అవుతోంది. అయితే అప్పటికే తెలంగాణలో కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. కొన్ని రకాల అభ్యంతరాలు తెలంగాణ నుంచి వచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అనుమతులు ఇవ్వకపోవడంతో ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది 2020లో. కేవలం ఈ ప్రాంత సెంటిమెంట్తో కూడుకున్న పని కావడంతో జగన్మోహన్ రెడ్డి ఆ ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. అనుమతులు లేకుండా ప్రాజెక్టు కట్టడం సులువు కాదు. ఆ విషయం తెలిసి కూడా జగన్మోహన్ రెడ్డి ఆ ప్రయత్నం చేశారు అంటే దాని వెనుక ఉన్న పరమార్థం ఇట్టే తెలిసిపోతోంది.మొన్నటికి మొన్న బనకచర్ల ప్రాజెక్ట కోసం ఆలోచన చేశారు చంద్రబాబు. రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసేందుకు ఈ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని భావించారు. కేవలం సముద్రంలో కలిసిపోతున్న నదీ జలాలను తరలించడం ద్వారా రాయలసీమలో సాగునీటి కొరత లేకుండా చేయవచ్చని భావించారు. అయితే దీనికి తెలంగాణ సమాజం నుంచి అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. అదే సమయంలో ఏపీలోని మిగతా రాజకీయ పక్షాల సహకారం కూటమి ప్రభుత్వానికి కరువైంది. కనీసం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నోరు తెరవలేదు. కానీ బనకచర్ల ప్రాజెక్టు విషయంలో తెలంగాణలోని కాంగ్రెస్తో పాటు గులాబీ పార్టీ నేతలు సైతం విమర్శలు చేశారు. కానీ ఏపీకి మద్దతుగా ఈ ప్రాజెక్టు కావాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కనీసం కోరలేదు. అప్పట్లో కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయంలో కనీస ప్రస్తావన లేదు. ఎప్పుడైతే తెలంగాణ సీఎం రేవంత్ చంద్రబాబు తో మాట్లాడి ఎత్తిపోతల పథకాన్ని ఆపించానని చెప్పడంతో.. దీనిని ఒక రాజకీయ అంశంగా మార్చేసింది

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.మాజీమంత్రి కీలక ప్రకటన.. రాయలసీమ జల ప్రయోజనాల కోసం ఇప్పుడు వైసీపీ ఉద్యమ బాట పట్టాలని నిర్ణయించింది. అవసరం అనుకుంటే పాదయాత్ర చేస్తామని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ప్రకటన చేశారు అంటే.. ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

తాము ప్రారంభించిన ప్రాజెక్టు నిలిచిపోవడం నిజం. వాటి అనుమతుల విషయంలో నిబంధనలు పాటించకపోవడం వాస్తవం. కానీ ఈ ప్రాజెక్టు చంద్రబాబు వల్లే నిలిచిపోయిందని చెబుతూ ఇప్పుడు వైసిపి నీళ్ల రాజకీయాలకు శ్రీకారం చుడుతుండడం మాత్రం గమనార్హం. అయితే మరోసారి ప్రజలకు ఈ విషయంలో వాస్తవాలు తెలిస్తే మాత్రం ఆ పార్టీకి ఇబ్బందికరమే.


# మరో ఎంపీకి కేంద్ర మంత్రి పదవి...

విజయవాడ,నెల్లూరు, జనవరి 17, కేంద్ర మంత్రివర్గ విస్తరణ పై ఊహాగానాలు వస్తున్నాయి. త్వరలో ప్రధాని నరేంద్ర మోడీ క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ జరుపుతారని ప్రచారం నడుస్తోంది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బిజెపి నేతలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. మిత్రపక్షాలకు సైతం పెద్ద ఎత్తున అవకాశం కల్పిస్తారని కూడా పొలిటికల్ సర్కిల్లో టాక్ నడుస్తోంది. అందులో భాగంగా ఏపీలో తెలుగుదేశం పార్టీకి మరో మంత్రి పదవి ఖాయమని సమాచారం. ఇప్పటికే ఆ పార్టీకి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు ఏపీ నుంచి. ఏపీ నుంచి బిజెపికి ఒక మంత్రి పదవి ఉంది. అయితే జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉండగా.. ఒక మంత్రి పదవి కూడా కేటాయించలేదు. అయితే ఇప్పుడు జనసేనకు కాకుండా టిడిపికి మరో పదవి ఇస్తారని ప్రచారం నడుస్తోంది. ప్రధానంగా ఓ సీనియర్ నాయకుడికి ఆ బాధ్యతలు ఇవ్వనున్నట్లు సమాచారం. ఏపీ నుంచి ఎన్డీఏ తరఫున 21 మంది ఎంపీలు గెలిచారు. అందులో 16 మంది తెలుగుదేశం పార్టీ నుంచి.. బిజెపి నుంచి ముగ్గురు? జనసేన నుంచి ఇద్దరు గెలిచారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగు ఎంపీలకు మాత్రమే పరిమితం అయింది. టిడిపి నుంచి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి పదవి దక్కింది. కీలకమైన పౌర విమానయాన చూస్తున్నారు ఆయన. గుంటూరు పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన పెమ్మసాని చంద్రశేఖర్ సైతం కేంద్రమంత్రి అయ్యారు. తొలిసారిగా గుంటూరు నుంచి పోటీ చేసి ఎంపీగా గెలిచారు. అయినా సరే ప్రధాని మోదీ తన క్యాబినెట్ లోకి తీసుకున్నారు. మరోవైపు నరసాపురం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ. ఆయనకు అనూహ్యంగా కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కింది. వాస్తవానికి బిజెపి తరఫున రాజమండ్రి నుంచి గెలిచిన పురందేశ్వరికి కానీ.. అనకాపల్లి నుంచి గెలిచిన సీఎం రమేష్ కు కానీ క్యాబినెట్ పదవి దక్కుతుందని అంతా భావించారు. కానీ అనూహ్యంగా భూపతి రాజు శ్రీనివాస్ వర్మ దక్కించుకున్నారు. అయితే ఇప్పుడు బిజెపికి ఏపీ నుంచి మరో మంత్రి పదవి వస్తుందంటే కచ్చితంగా పురందేశ్వరి, సీఎం రమేష్ మధ్య గట్టి పోటీ ఉంటుంది.జనసేనకు ఇద్దరు ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి బాలశౌరి, కాకినాడ నుంచి మరొకరు గెలిచారు. అయితే ఈసారి జనసేనకు చాన్స్ ఇస్తే మాత్రం కచ్చితంగా బాలశౌరికి అవకాశం ఉంటుంది. అయితే తెలుగుదేశం పార్టీకి ఇస్తే మాత్రం సామాజిక ఈక్వేషన్స్ ఖాయం. అయితే ప్రధానంగా నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో రాజ్యసభ సభ్యుడిగా ఉండేవారు ప్రభాకర్ రెడ్డి. 2024 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయనతో పాటు భార్య ప్రశాంతి రెడ్డి కూడా టిడిపిలో చేరారు. నెల్లూరు ఎంపీగా పోటీ చేసి గెలిచారు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి. అయితే నెల్లూరులో పరిస్థితి మారడం వెనుక వేమిరెడ్డి పాత్ర ఉంది. పైగా ఆర్థికంగా స్థితిమంతుడు కావడంతో ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. వేమిరెడ్డికి ఇస్తే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు తో పాటు ప్రకాశం జిల్లాలో అన్ని అసెంబ్లీ సీట్లతో పాటు ఎంపీ స్థానాలను కైవసం చేసుకోవచ్చని చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రి పదవికి ఆయన పేరు సిఫారసు చేసినట్లు సమాచారం. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# వెలవెలబోయిన రోడ్డు

హైదరాబాద్ సంక్రాంతి పండుగ వస్తే చాలు హైదరాబాద్ లోని కూకట్ పల్లి, కేపి.హెచ్.బి, జేఎన్టీయూ పరిసర ప్రాంతాలు ప్రధాన రహదారులు నిర్మానుషంగా కనిపించాయి. ఇక్కడ నివసించే వారందరూ పండుగ నేపథ్యంలో సొంత గ్రామాలకు వెళ్లడంతో రద్దీ ఉండాల్సిన రోడ్లన్నీ వెలవెలబోయాయి. సామాన్య సమయంలో ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ట్రాఫిక్ రద్దీతో గంటల తరబడి ఆగుతూ వెళ్తూ ఉండాలి. వారం రోజులపాటు పాఠశాలలకు సెలవులు ఉండడం పండుగతో పాటు వీకెండ్ కలిసి రావడంతో కాంక్రీట్ జంగల్ ను వీడి పల్లెకు చేరుకున్నారు ప్రజలు. ఇలానే ప్రతిరోజు ఉంటే బాగుంటుంది అని పలువురు భావిస్తున్నారు

# లింకులను క్లిక్ చేస్తే బుక్ అయినట్లే ఎమ్మిగనూరు సీఐ



ఎమ్మిగనూరు వాట్సాప్ గ్రూపులలో 'నాకు రూ.5 వేలు వచ్చాయి. నేను నకిలీ అనుకున్నాను. మీరూ ప్రయత్నించి చూడండి. మీరు పది మందికి ఈ లింకును ఫార్వర్డ్ చేయండి' అని వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని ఎమ్మిగనూరు సిఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్లు ఆన్లైన్ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, తదితర మాధ్యమాల నుంచి వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు.

# సంబరాల్లో రాంబాబు..

గుంటూరు, జనవరి 17, అంబటి రాంబాబు మరోసారి వైరల్ అయ్యారు. గతం మాదిరిగా సంక్రాంతి సంబరాల్లో డాన్స్ వేశారు. గుంటూరులో వైయస్సార్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భోగి వేడుకలు ఘనంగా జరిగాయి. గతం మాదిరిగానే అంబటి రాంబాబు హుషారైన పాటలకు డాన్స్ చేస్తూ అలరించారు. సంబరాల రాంబాబు అనే పేరు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందని.. తనపై గేలిచేసే ప్రయత్నమే తనకు ఈ పేరు తెచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం అంబటి రాంబాబు డాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా భోగి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా గుంటూరులో వైసీపీ ఆధ్వర్యంలో వేడుకలు ఏర్పాటు చేశారు. తెల్లవారుజామున ఆయన భోగి వేడుకలు జరిగే ప్రాంతానికి చేరుకున్నారు. డప్పు చప్పులతో వేడుకలు నిర్వహించిన ఆయన.. తనదైన శైలిలో హుషారుగా స్టెప్పులు వేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు సంబంధించిన జీవోలను భోగిమంటల్లో వేశారు.అయితే గత అనుభవాల దృష్ట్యా అంబటి రాంబాబు ఈసారి డాన్స్ వేయరని అంతా భావించారు. కానీ ఒకేసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు జగన్మోహన్ రెడ్డికి సంబంధించిన పాటలకు డ్యాన్సులతో అలరించారు అంబటి రాంబాబు. ఆయనతోపాటు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా డ్యాన్సులు వేయడం కనిపించింది. హుషారైన పాటలతో అక్కడ ఉన్న పార్టీ శ్రేణులు మరింతగా డాన్స్ వేసేందుకు ముందుకు వచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో.. మంత్రి హోదాలో సత్తెనపల్లి లో జరిగే వేడుకల్లో పాల్గొనేవారు అంబటి రాంబాబు. అప్పట్లో రాంబాబు పై సెటైర్లు పడేవి. పవన్ కళ్యాణ్ సంబరాల రాంబాబు అనే పేరు కూడా పెట్టారు. పవన్ కళ్యాణ్ నటించిన సినిమాలో అంబటి రాంబాబును అనుకరిస్తూ ఒక పాత్రను కూడా పెట్టారు. అప్పటినుంచి సంబరాల రాంబాబు గా ఫేమస్ అయ్యారు అంబటి రాంబాబు.

ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు అంబటి రాంబాబు. గతంలో విమర్శలు రావడంతో ఈసారి ఆయన డాన్సుల జోలికి పోరని అంతా భావించారు. కానీ అంబటి రాంబాబు వెనక్కి తగ్గలేదు. డాన్సులతో అలరించారు. అంబటి రాంబాబుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తాను సంక్రాంతికి సంబరాలు చేస్తాను కాబట్టే.. తనకు సంక్రాంతి సంబరాల రాంబాబు అనే పేరు వచ్చిందని తెలిపారు. తాను సంబరాల రాంబాబు అనే విషయాన్ని అంగీకరిస్తానని అంబటి రాంబాబు స్పష్టం చేశారు. అదే విషయాన్ని పవన్ కళ్యాణ్ అంగీకరిస్తారా అని ప్రశ్నించారు.

# కేతనకొండలో ఘర్షణ



నందిగామ ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కేతనకొండలో తీవ్ర ఉద్రిక్తత నెలకింది. ఒక సామాజికవర్గం యువకుడి చెవిని మరో సామాజీకవర్గం యువకుడు కోసివేయడంతో వివాదం చెలరేగింది. రెండు సామాజిక వర్గాలు ఘర్షణకు దిగాయి నందిగామ నియోజకవర్గం కీసరలో జరిగిన కోడి పందేల వద్ద జరిగిన గొడవే ఉద్రిక్తత కు కారణంగా తెలుస్తోంది. పోలీసులు వచ్చి రెండు వర్గాలను చెదరగొట్టారు.

## దేశంలో 4 ఏళ్లలో 3.3 లక్షల మంది దుర్మరణం

ముంబై, జనవరి 16, (న్యూస్ పల్స్) బైక్ యాక్సిడెంట్లు, దేశవ్యాప్తంగా పెరుగుతున్న రోడ్డు మరణాల పట్ల కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారం.. 2019 నుంచి 2023 వరకు గత 5 ఏళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చనిపోయిన వారిలో దాదాపు సగం మంది బైక్ ప్రయాణికులే కావడం గమనార్హం. ఈ పరిస్థితిని అరికట్టేందుకు ప్రభుత్వం 2026 నాటికి భారీ సంస్కరణలు, కొత్త చట్టాలను తీసుకురావడానికి సిద్ధమవుతోంది.ఈ 5 ఏళ్లలో మొత్తం 7.78 లక్షలకు పైగా రోడ్డు ప్రమాద మరణాలు చోటు చేసుకున్నాయి. ఇందులో ద్విచక్ర వాహన ప్రమాదాల్లో చనిపోయిన వారి సంఖ్య 3.35 లక్షలకు పైగా ఉండటం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. 2023లో బైక్ మరణాల శాతం 45 శాతం అంటే 77,539 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న యువత 66 శాతం 18 నుంచి 34 ఏళ్ల వయస్సు వారు ఉన్నట్లు తేలింది.కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల ప్రకటించిన వివరాల ప్రకారం.. ఈ ఏడాదిలో రోడ్డు భద్రతపై విప్లవాత్మక మార్పులు రానున్నాయి. మోటారు వాహన చట్టానికి సుమారు 61 సవరణలతో కూడిన నూతన రోడ్డు భద్రతా బిల్లును 2026లో పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. 2026 జనవరి నుంచి అమ్ముడయ్యే అన్ని కొత్త ద్విచక్ర వాహనాలకు యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ తప్పనిసరి కానుంది. ప్రతి కొత్త బైక్ కొనుగోలుతో పాటు.. షోరూమ్ యజమానులు ఐఎస్ఐ గుర్తింపు పొందిన రెండు హెల్మెట్లను (రైడర్, పిలియన్ రైడర్ కోసం) ఉచితంగా లేదా వాహనం ధరలోనే భాగంగా అందించాల్సి ఉంటుంది.2026 చివరి నాటికి వాహనాల మధ్య పరస్పర సమాచార మార్పిడికి ఉపయోగపడే వెహికల్ టు వెహికల్ కమ్యూనికేషన్ సిస్టమ్ను ప్రయోగాత్మకంగా తీసుకురానున్నారు. ఇది మంచు లేదా పొగమంచు సమయాల్లో ప్రమాదాల గురించి డ్రైవర్లను అప్రమత్తం చేస్తుంది. రోడ్డు ప్రమాద బాధితులను కాపాడే వారికి ఇచ్చే రివార్డును రూ. 25 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే.. బాధితులకు 7 రోజుల పాటు రూ. 1.5 లక్షల వరకు ఉచిత క్యాష్లెస్ చికిత్స అందించనున్నారు.

## గుంటూరు నగరంలో కిడ్నాప్ కలకలం

గుంటూరు సంక్రాంతి పండుగ వేళ గుంటూరు నగరంలో కిడ్నాప్ ఘటన కలకలం రేపింది. పట్టాభిపురం ప్రాంతానికి చెందిన ఒక మైనారిటీ యువకుడిని గుర్తు తెలియని దుండగులు అపహరించిన ఘటన నగరంలో తీవ్ర ఆందోళనకు దారి తీసింది.వివరాల ప్రకారం, బాధిత యువకుడిని గుంటూరు నగరంలోని హేమా హాస్పిటల్ పరిసర ప్రాంతంలో దుండగులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించుకుని తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

పోలీసుల్ని ఆశ్రయించిన కుటుంబ సభ్యులుసంక్రాంతి పండుగ సందర్భంలో ఇటువంటి ఘటన జరగడం నగరవాసుల్లో భద్రతాపరమైన ఆందోళనలను పెంచుతోంది. బాధిత యువకుడిని సురక్షితంగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు తగిన ప్రయత్నాలు చేయాలని కోరుతున్నారు. నగరవాసులు ఆశిస్తున్నారు..

## లక్సెట్టిపేటలో విషాదం రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి





**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 16 :** మంచిర్యాలలోని లక్షెట్టిపేట పట్టణంలో వ్యాపారం నిర్వహిస్తున్న సత్యనారాయణ జనరల్ స్టోర్ యజమాని పాలకుర్తి సత్యనారాయణ,(63)రమా(59) దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి.వివరాలు ఇలా ఉన్నాయి.ఈ నెల 8 న ఇరువురు దంపతులు అయ్యప్ప మాలలో ఓ ప్రైవేట్ సర్వీస్ లో శబరిమలై దర్శనానికి వెళ్లారు.15 మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకొని ప్రైవేట్ టూరిస్ట్ లో తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి వద్ద బైపాస్ రోడ్ లో స్వాముల కోసం రెండు గంటల సేపు టూరిస్ట్ నిలిపివేశారు.సముద్ర స్నానం,అక్కడున్న దేవాలయాలు సందర్శించి టూరిస్ట్ ఆపిన చోటికి వచ్చిన సత్యనారాయణ,రమ దంపతులు రోడ్డు దాటుతుండగ ఓవాహనం ఢీ కొని దంపతులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతి చెందిన దంపతుల మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పడిపోతున్న ఇరాన్ కరెన్సీ..

న్యూఢిల్లీ, జనవరి 16, (న్యూస్ పల్స్) రాన్ ఆర్థిక వ్యవస్థ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. ఆర్థిక సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోంది. దేశ కరెన్సీ రియాల్ విలువ పతనం ఆగడం లేదు. దీంతో ప్రజలు పెరిగిన నిత్యావసర ధరతో ఆందోళనలు ఉధృతం చేస్తున్నారు. ప్రస్తుతం ఒక డాలర్ విలువ ఇరాన్లో 14 లక్షల రియాల్కు చేరింది. దీంతో సామాన్యులు రోజువారీ అవసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి నెలకొంది. భారత రూపాయితో పోల్చితే, కేవలం రూ.90తో 14 లక్షల రియాల్స్ పొందవచ్చు. గత డిసెంబర్లో సెంట్రల్ బ్యాంక్ అధ్యక్షుడు మొహమ్మద్ రెజా ఫార్జిన్ రాజీనామా చేశారు.గత జూన్లో ఇజ్రాయిల్తో ప్రారంభమైన యుద్ధం ఇరాన్ పతనాన్ని వేగవంతం చేసింది. అమెరికా యూక్లియర్ సైట్లపై దాడులు, ఐకేయరాష్ట్ర సమితి ఆంక్షలు ఆర్థికాన్ని కుంగదీశాయి. 2018లో ట్రంప్ పాలిసీతో జిల్లెడిన ఆయిల్ ఎగుమతులు, విదేశీ ముద్ర లభ్యత తగ్గడం సమస్యలను మరింత తీవ్రతరం చేశాయి.1979 విప్లవ సమయంలో డాలర్ విలువ 70 రియాల్స్కు సమానంగా ఉండేది. 2026 ప్రారంభంలో 14 లక్షలకు చేరింది. 40 ఏళ్లలో విలువ 20,000 రెట్లు పడిపోయింది. 2025లో మాత్రమే 45 శాతం క్షీణత. బంక్ డబ్బులు కరిగిపోతాయని భయపడి పౌరులు డాలర్లు, బంగారు కొనుగోళ్లకు దూకుతున్నారు.డిసెంబర్లో టెహ్రాన్ గ్రాండ్ బజార్ వ్యాపారులు ధరల పెరుగుదలతో ఇబ్బంది పడ్డారు. రియాల్ పతనంతో రుణాలు పెరిగి, విద్యార్థులు, కార్మికులు ఆందోళన చెందుతున్నారు. జొమ్హౌరి అవెన్యూలో ప్రారంభమైన ఇది ఇప్పుడు అయతోల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ఇస్లామిక్ రిపబ్లిక్పై పోరుగా మారింది. 2022లో మహ్సా అమినీ మరణం తర్వాతి అల్లర్లు ఇప్పటి అగ్నిపర్వతాన్ని పెంచాయి.ఇరాన్ సంక్షోభం భారత్పైనా ప్రభావం పడే అవకావం ఉంది. మన దేశం గతేడాది 1.24 బిలియన్ డాలర్ల విలువైన ఉత్పత్తులను ఎగుమతి చేసింది. 0.44 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది. ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 1.68 బిలియన్ డాలర్లు. భారత కరెన్సీలో రూ.15 వేల కోట్లకుపైనే. ఆర్థిక సంక్షోభం కారణంగా ఎగుతులు నిలిచిపోయే ప్రమాదం ఉంది.

# సైబర్ దాడి వ్యూహం..

న్యూఢిల్లీ, జనవరి 16, (న్యూస్ పల్స్) ట్రిగర్ జారలేదు, గుండు బయల్దేరలేదు, మిసైల్ ప్రయోగం జరగలేదు. అయినా వెనెజువెలాలో పూర్తి యుద్ధం జరిగి ముగిసింది. అమెరికా విమానాలు ఎగరకుండా, రాడార్లు మౌనంగా మారాయి. అధ్యక్షుడు మదురో దంపతులు అదుపులోకి రాలేదు. ఇది సైబర్ యుద్ధం ? నాలుగు సంప్రదాయ యుద్ధాలకు (నేల, ఆకాశ, సముద్ర, స్పేస్) ఐదవ అధ్యాయం. ప్రపంచ యుద్ధ చరిత్రలో కొత్త అధ్యాయం రాసిన ఈ ఘటన ప్రతి దేశానికి పాఠాలు చెబుతోంది.వెనెజువెలా విద్యుత్ గుర్రం గురీ డ్యామ్ సూపర్ విజరీ సిస్టమ్ మొదట లక్ష్యం. రెండు కీలక టార్గెట్లతో మొత్తం విద్యుత్ సరఫరా కట్ అయింది. మిలటరీ అంధకారంలో మునిగింది. రాడార్లు ఆఫ్, ఎయిర్ఫోర్స్ ఇన్వర్టర్లపై ఆధారపడింది. ఫైబర్ ఆప్టిక్ నెట్వర్క్ కూడా నిలిచిపోయింది. టెలిఫోన్లు పనిచేయలేదు, సమాచార బదిలీ ఆగిపోయింది. రాడార్లు రీబూట్ అయ్యే ముందే 150 అమెరికా విమానాలు దేశంలోకి చేరాయి.ఇది ఒక్కరోజు ఆపరేషన్ కాదు. 10?15 ఏళ్లుగా అమెరికా సాఫ్ట్వేర్, హార్డ్వేర్ చిప్స్లో మాల్వేర్ ఏర్పాటు చేసింది. ఎప్పుడు కావాలంటే ఆ సిస్టమ్ షట్డౌన్ చేసే సామర్థ్యం కలిగింది. వెనెజువెలా చిప్స్ ఆధారంగా ఉండటం వల్ల వారి ప్రత్యేక రక్షణ లేకపోయింది. దొంగల మార్గాలు, సైనిక కదలికలు అన్నీ అమెరికాకు తెలిసాయి. యుద్ధ సమయంలో విద్యుత్ అంతరాయం తప్పనిసరి. సోలార్, జనరేటర్లు సిద్ధంగా ఉండాలి. విదేశీ చిప్స్, సాఫ్ట్వేర్లో బ్యాక్డోర్ ఉండే అవకాశం. స్వదేశీ సాంకేతికతపై ఆధారపడాలి. సైబర్ దాడులకు తట్టుకునే ఆల్టర్నేటివ్ నెట్వర్క్లు అవసరం.అజర్బైజాన్ డ్రోన్ యుద్ధంలా, ఇజ్రాయెల్ ఐరన్ డోమ్లా సైబర్ యుద్ధం కూడా కొత్త నార్మల్. ఇజ్రాయెల్ లెబనాన్ పేజర్ బాంబుల్లా భవిష్యత్ యుద్ధాలు హైబ్రిడ్ రూపంలో ఉంటాయి. పౌరులు, మిలటరీ, సైబర్ బలగాల మధ్య సమన్వయం లేకుండా గెలుపు అసాధ్యం.వెనెజువెలా యుద్ధం ప్రపంచ రక్షణ వ్యూహాలను మార్చేస్తుంది. భారత్కు స్వదేశీ సాంకేతికత, సైబర్ రక్షణ, పౌర?సైనిక సమన్వయంపై దృష్టి పెట్టాలి. రాబోయే యుద్ధాలు బుల్లెట్లు కాకుండా బైట్లతో జరుగుతాయి.

# 10 మినిట్స్ డెలివరీలు రద్దు

ముంబై, జనవరి 16, (న్యూస్ పల్స్) ఆన్లైన్ సర్వీస్లకు డిమాండ్ పెరుగుతోంది. ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఈకామర్స్ సంస్థలపైనే చాలా వరకు ఆధారపడుతున్నారు. దీంతో ఈకామర్స్ సంస్థలు కూడా కస్టమర్లకు మెరుగైన సేవలు అందిచేందుకు ఫోటీపడుతున్నాయి. ఈ క్రమంలో జెప్టో, బ్లింకిట్ వంటి సంస్థలు పది నిమిషాల్లో డెలివరీ సర్వీస్లు అందుబాటులోకి తెచ్చాయి. అయితే ఈ విధానంతో ఆయా సంస్థలో పనిచేసే గిగ్ వర్కర్లు ఇబ్బంది పడుతున్నారు. గిగ్ వర్కర్ల నిరసనల నేపథ్యంలో కేంద్రం క్విక్ కామర్స్ సంస్థలపై కొత్త ఆంక్షలు విధించింది. కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ 10 నిమిషాల డెలివరీలను రద్దు చేయాలని ఆదేశించారు. బ్లింకిట్ వంటి ప్లాట్ఫామ్లు యాడ్లలో ఈ టైమ్లైన్ చూపకూడదని స్పష్టం చేశారు.కొత్త సంవత్సరానికి ముందు డెలివరీ బాయ్స్లు తీవ్రంగా అసంతృప్తి వ్యక్తం చేశారు. అధిక వేగ లక్ష్యాలు ప్రమాదాలు, ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయని డిమాండ్ చేశారు. ఈ ఒత్తిడి కేంద్ర జోక్యం చేసుకుంది. 10 నిమిషాల మోడల్ రద్దు సంస్థల వ్యాపార వ్యూహాలను మార్చనుంది. డెలివరీ సమయాలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. కానీ వర్కర్ల భద్రత మెరుగుపడుతుంది.ఈ మార్పు ఇ?కామర్స్ రంగాన్ని ప్రభావితం చేస్తుంది. గ్రాహకులు సౌలభ్యం కోల్పోవచ్చు, సంస్థలు కొత్త మార్గాలు ఆవిష్కరించాలి.

గిగ్ ఎకానమీలో కార్మిక హక్కులు బలపడుతాయి.డెలివరీ వేగాలకు భద్రతా మార్గదర్శకాలు రూపొందించాలి. వర్కర్లకు బీమా, శిక్షణ కార్యక్రమాలు అమలు చేయాలి. సంస్థలు బాధ్యతాయుత వ్యాపార మోడల్లకు మారాలి.మొత్తంగా గిగ్ వర్కర్లకు తాజా నిర్ణయం ఊరట దక్కింది. క్విక్ కామర్స్ సమస్థలు కూడా ఈమేరకు ప్రకటన చేశాయి. పది నిమిషాల డెలివరీని ఉప సంహరించుకుంటున్నట్లు ప్రకటించాయి.

## గుండెపోటుతో కానిస్టేబుల్ మృతి.. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్గా పనిచేస్తున్న ఎం. పాపయ్య విధి నిర్వహణలో గుండెపోటుతో బాధపడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించారు. ఆయన భౌతికకాయానికి కరీంనగర్లో ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఆదేశాల మేరకు, మృతుని కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల కోసం తక్షణ సహాయంగా రూ. 30,000 నగదును అధికారులు అందజేశారు.

## బ్రిడ్జిపై యాక్సిడెంట్.. నలుగురికి తీవ్ర గాయాలు

కొత్తగూడెం పరిధిలోని సుజాతనగర్ మండలం మంగపేట వద్ద గల బ్రిడ్జిపై రోడ్డు ప్రమాదం జరిగింది. కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు డివైడర్ను ఢీకొట్టడంతో అందులో ప్రయాణిస్తున్న కల్లూరుకు చెందిన నలుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించి, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# మున్సిపాల్టీల్లో ఆమెదే

హైదరాబాద్, జనవరి 16, తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఎన్నికల సంఘం దాదాపుగా పూర్తిచేస్తోంది. ఓటర్ల వివరాలను దాదాపుగా ఫైనల్ చేసింది. రాష్ట్రంలోని మొత్తం 123 మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల తుది జాబితా విడుదలైంది. ఈ గణాంకాల ప్రకారం, మొత్తం 2,996 వార్డుల్లో కలిపి 52,43,023 మంది ఓటర్లు తమ ఓటు హక్కును కలిగి ఉన్నారు. గతంతో పోలిస్తే పట్టణ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరగడం విశేషం. మున్సిపల్ ఓటర్ల జాబితాలో మహిళా ఓటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. మొత్తం 123 మున్సిపాలిటీలకు గానూ ఏకంగా 113 మున్సిపాలిటీల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఓటర్లలో 51.1 శాతం మంది మహిళలు ఉండగా, వీరి సంఖ్య 26,80,014 గా ఉంది. పురుష ఓటర్లు 25,62,369 (48.9 శాతం) ఉండగా, ఇతరులు 640 మంది ఉన్నారు. పట్టణ ఓటర్ల జాబితాను నిశితంగా గమనిస్తే, పురుషుల కంటే మహిళలు దాదాపు 1.17 లక్షల మంది ఎక్కువగా ఉన్నారు. కేవలం 10 మున్సిపాలిటీల్లో మాత్రమే పురుష ఓటర్లు ఆధిక్యంలో ఉండగా, మిగిలిన చోట్ల మహిళలే నిర్ణాయక శక్తిగా మారనున్నారు. ఈ గణాంకాలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ పార్టీల వ్యూహాలను మార్చే అవకాశం ఉంది. ఎన్నికల సంఘం విడుదల చేసిన ఈ అధికారిక గణాంకాలు పట్టణ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీస్తున్నాయి. వార్డుల వారీగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిన అధికారులు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్ణాయక శక్తిగా ఉన్న మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయి.

రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు మరియు కొన్ని కార్పొరేషన్లకు సంబంధించి ఫిబ్రవరి లేదా మార్చిలో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధమైంది. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన గణన ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుంది. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే, జనవరి నెలాఖరులో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ఎప్పుడో ముగిసింది. ప్రస్తుతం స్పెషల్ ఆఫీసర్ల పాలనలో ఉన్నాయి.

ఎత్తులు.. పై ఎత్తులు

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ దిశగా పురపాలక శాఖ కీలక అడుగు వేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 121 మున్సిపాలిటీలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా కేటగిరీలకు చైర్‌పర్సన్ స్థానాల సంఖ్యను పురపాలకశాఖ ఖరారు చేసినట్లు సమాచారం. జనాభా ప్రాతిపదికన ఏ ఏ కేటగిరీలకు ఎన్ని స్థానాలు కేటాయించాలనే అంశంపై స్పష్టతనిస్తూ ప్రాథమిక జాబితాను సిద్ధం చేశారు. మునిసిపాలిటీ చైర్మన్ల సంఖ్య విభాగాల వారీగా.. జనరల్ 30, జనరల్ మహిళలు 31 స్థానాలు, ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2, ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8, బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19 స్థానాలను కేటాయించాలని పురపాలకశాఖ ప్రాథమికంగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మూడు రోజుల్లో దీనిపై క్లారిటీ రానుంది.

రిజర్వేషన్ల వివరాలు - మొత్తం 121 మున్సిపాలిటీల్లో స్థానాల కేటాయింపు

జనరల్: 61 స్థానాలు (వీటిలో జనరల్ 30, జనరల్ మహిళ 31)

బీసీ (వెనుకబడిన తరగతులు): 38 స్థానాలు (బీసీ జనరల్ 19, బీసీ మహిళ 19)

ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు): 17 స్థానాలు (ఎస్సీ జనరల్ 9, ఎస్సీ మహిళ 8)

ఎస్టీ (షెడ్యూల్డ్ తెగలు): 5 స్థానాలు (ఎస్టీ జనరల్ 3, ఎస్టీ మహిళ 2)

మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 50 శాతం స్థానాలను మహిళలకు కేటాయించడం విశేషం.

తుది ప్రకటన ఈ నెల 17న

మునిసిపాలిటీ చైర్మన్ల రిజర్వేషన్ల స్థానాల సంఖ్యను ఖరారు చేసిన తెలంగాణ ప్రభుత్వం, ఏయే మున్సిపాలిటీ ఏ వర్గానికి కేటాయించాలనే (లక్కీ డిప్ లేదా రోస్టర్ విధానం) తుది రిజర్వేషన్లను ఈ నెల 17న అధికారికంగా ప్రకటించనుంది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండటంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. అభ్యర్థులు తమ తమ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. తెలంగాణలో మూడు విడతల్లో ఉత్కంఠభరితంగా సాగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులు స్పష్టమైన ఆధిపత్యం చెలాయించారు. రాష్ట్రంలోని మెజారిటీ జిల్లాల్లో అధికార కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అధికార పార్టీ అభ్యర్థులు దాదాపుగా క్లీన్ స్వీప్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ముఖ్యంగా రైతు భరోసా, రుణమాఫీ అంశాలు ఓటర్లపై సానుకూల ప్రభావం చూపినట్లు కనిపిస్తున్నాయి. అయితే స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ మద్దతుదారులే గెలుస్తారని తెలిసిందే. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కూడా గట్టి పోటీని ఇచ్చింది. ఉత్తర తెలంగాణలోని కొన్ని నియోజకవర్గాల్లో, సిద్దిపేట, గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో బీఆర్ఎస్ మద్దతుదారులు మెరుగైన ఫలితాలు సాధించారు. బీజేపీ కూడా ఈసారి గ్రామీణ స్థాయిలో తన పట్టును నిరూపించుకుంది, ముఖ్యంగా నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఆ పార్టీ మద్దతుదారులు గణనీయమైన స్థానాల్లో విజయం సాధించారు.

# నల్గొండకు కార్పొరేషన్ హోదా

నల్గొండ, జనవరి 16, నల్గొండ జిల్లాకు మహర్దశ పట్టనుంది. జిల్లాకు కార్పొరేషన్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. దీనిపై తాజాగా కీలక అప్డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తున్న అంశంపై తాజాగా అధికారిక గెజిట్ విడుదల చేసింది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనివల్ల పాలనపరంగా అధికారాలు పెరిగి, అభివృద్ధికి నిధులు, పథకాలు నేరుగా అందనున్నాయి. మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థతో పాటు మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కానుంది.నల్గొండ మున్సిపాలిటీ ఇకపై కార్పొరేషన్‌గా మారనున్న సంగతి తెలిసిందే. జిల్లా కేంద్రానికి కార్పొరేషన్ హోదాను కల్పిస్తూ ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో నల్గొండను కార్పొరేషన్‌గా మార్చేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా దీనిపై కీలక అప్‌డేట్ వచ్చింది. నల్గొండను కార్పొరేషన్‌గా మారుస్తూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది.ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కే. శ్రీదేవి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీగా ఉన్న నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల పాలనాపరంగా నల్గొండకు ఎక్కువ అధికారాలు దక్కుతాయి. అలాగే దాని విస్తృతి పెరిగే అవకాశం ఉంది. ఈ ప్రాంత అభివృద్ధి కోసం నిధులు పెరగనుండటంతో పాటు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలు నేరుగా అందే అవకాశం ఉంది. అలాగే కొత్త డివిజన్లను పునర్వ్యవస్థీకరించనున్నారు.నల్గొండ కార్పొరేషన్‌గా మారడంతో.. ఇకపై ఇక్కడ మేయర్, డిప్యూటీ మేయర్ వ్యవస్థ అమలులోకి రానుంది. కమిషనర్ స్థాయి అధికారుల వ్యవస్థ అమల్లోకి రావడంతో పాలన మరింత బలోపేతం కానుంది. నల్గొండను కార్పొరేషన్‌గా మార్చడం వల్ల ఈ ప్రాంతంలో రహదారులు, మురుగు నీరు, తాగు నీరు, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం అవుతుంది. పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్)లో కార్పొరేషన్ నిబంధనలు అమలు అవుతాయి. ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను విధానాల్లో మార్పులు జరుగుతాయి. త్వరలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండ కార్పొరేషన్‌కు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు.తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లకు సంబంధించి రిజర్వేషన్లను ఖరారు చేస్తూ బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియలో భాగంగా పాటించాల్సిన మార్గదర్శకాలు, నియమ, నిబంధనలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. జనవరి 17న ఏ ఏ స్థానాలను.. ఏ ఏ వర్గాలకు కేటాయిస్తారనే దానిపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉంది అంటున్నారు. ఈ మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా నల్గొండకు కూడా ఎలక్షన్ నిర్వహిస్తారు

# వ్యవసాయ భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు

మహబూబ్ నగర్, జనవరి 16,తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ల అక్రమాల విచారణ రెవెన్యూ అధికారులను కలవరపెడుతోంది. 2021-2025 మధ్య కాలంలో జనగామ, రంగారెడ్డి వంటి కీలక జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు ఇప్పుడు ఏసీబీ విచారణకు భయపడుతున్నారు. ధరణి పోర్టల్ ద్వారా జరిగిన లావాదేవీల్లో చలానాల మాయాజాలం, నిబంధనల ఉల్లంఘనలపై ప్రభుత్వం నియమించిన ప్రత్యేక కమిటీ ఆడిటింగ్ నిర్వహిస్తోంది. ఇప్పటికే పలువురు రైతులకు నోటీసులు జారీ కాగా.. సంక్రాంతి తర్వాత అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది.తెలంగాణలో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన అక్రమాల విచారణ ఇప్పుడు రెవెన్యూ శాఖలో పెను తుపానును సృష్టిస్తోంది. ప్రధానంగా భూముల క్రయవిక్రయాల్లో జరిగిన లావాదేవీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించడంతో.. గతంలో కీలక జిల్లాల్లో పనిచేసిన అధికారులు ఇప్పుడు వణికిపోతున్నారు.ముఖ్యంగా 2021 నుండి 2025 మధ్య కాలంలో జనగామ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పనిచేసిన తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ విచారణ కమిటీలో అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా సభ్యులుగా ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. గతంలో తాము చేసిన భూముల బదిలీలు లేదా రిజిస్ట్రేషన్లలో ఏవైనా సాంకేతిక లోపాలు ఉన్నాయా అనే కోణంలో సిబ్బంది ఆరా తీస్తున్నారు. ఈ కేసు ఒక ప్రాంతానికో లేదా ఒక అధికారికి సంబంధించినది మాత్రమే కాదు. రాష్ట్రవ్యాప్తంగా ధరణి పోర్టల్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్లలో అనేకలోపాలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించినట్లు తప్పుడు చలానాలను సృష్టించడం లేదా ఒకే చలానాను ఒకటి కంటే ఎక్కువ సార్లు ఉపయోగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విచారణలో భాగంగా ఇప్పటికే అనేకమంది భూయజమానులకు, రైతులకు రెవెన్యూ శాఖ నోటీసులు పంపింది. వారి నుంచి ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరిస్తోంది. భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతి రిజిస్ట్రేషన్ లావాదేవీని క్షుణ్ణంగా ఆడిటింగ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా లావాదేవీల్లో తేడాలు వచ్చిన వివరాలను నేరుగా ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపారు.ప్రస్తుతానికి ప్రభుత్వం నియమించిన కమిటీ కేవలం ఆధారాల సేకరణలో నిమగ్నమై ఉంది. సంక్రాంతి పండుగ ముగిసిన తర్వాత ఈ విచారణ ప్రక్రియ మరింత వేగవంతం కానుంది. పోలీసులు ఇప్పటికే కొందరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తుండటంతో.. వారిచ్చే సమాచారం ఆధారంగా రెవెన్యూ అధికారులకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది.కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఆడిటింగ్‌లో 90 శాతం నివేదికలు ఇప్పటికే ప్రభుత్వానికి అందాయి. కొన్ని చోట్ల చిన్నపాటి పొరపాట్లు జరిగినట్లు అధికారులు అంగీకరిస్తున్నప్పటికీ.. ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొట్టే స్థాయిలో అక్రమాలు జరిగాయా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ కేసు తేలే వరకు తహసీల్దార్ల కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి కంటిమీద కునుకు లేకుండా పోయింది.

# ఖమ్మం జిల్లాల్లో భారీగా కోడి పందేలు

ఖమ్మం, జనవరి 16, సంక్రాంతి పండుగ వేళ తెలంగాణ-ఆంధ్ర సరిహద్దుల్లో కోడి పందాల జోరు శిఖర స్థాయికి చేరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడుకు సమీపంలోని ఏలూరు జిల్లా గ్రామాల్లో పందెం రాయుళ్లు లక్షల్లో బెట్టింగ్ కాస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో పోలీసుల నిఘా పెరగడంతో, వేలాది మంది జూదరులు కారుల్లో ఆంధ్ర వైపు తరలివెళ్తున్నారు. మామిడి, పామాయిల్ తోటల్లో ఫ్లడ్ లైట్ల మధ్య రాత్రిపూట కూడా పందాలు సాగుతున్నాయి. కోడి కత్తుల పోరుతో పాటు పేకాట, గుండాట వంటి జూదాలు కూడా జోరుగా నడుస్తున్నాయి.సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు తెలుగు రాష్ట్రాల్లో పండుగ సందడి కంటే కోడి పందాల జోరే ఎక్కువగా కనిపిస్తుంది. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దు ప్రాంతాల్లో ఈసారి పందాల వేడి శిఖర స్థాయికి చేరింది. తెలంగాణలో పోలీసులు నిఘా పెంచడంతో.. పందెం రాయుళ్లు పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ సరిహద్దు గ్రామాలకు క్యూ కట్టారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలానికి ఆనుకుని ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలు ఈసారి కోడి పందాలకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, చీరవల్లి, శ్రీధర్ వేలేరు, వేలేరుపాడు మండలం మేడేపల్లి వంటి గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచే పందాలు మొదలయ్యాయి. కొన్ని చోట్ల స్థానిక ప్రజాప్రతినిధులే స్వయంగా ఈ పందాలను ప్రారంభించడం గమనార్హం.

మామిడి తోటలు, పామాయిల్ తోటలు పందెం వేదికలుగా మారిపోయాయి. రాత్రి వేళల్లో కూడా పందాలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు, జనరేటర్లు సిద్ధం చేశారు. సంక్రాంతి సమయంలో కోడి పందాలు అనేది కేవలం వినోదం మాత్రమే కాదు.. దీని వెనుక ఒక పెద్ద ఆర్థిక వ్యవస్థ నడుస్తుంది. పందెం కోళ్లను పెంచడం ఒక ప్రత్యేక కళ. వీటికి బాదం, పిస్తా, జీడిపప్పు వంటి బలవర్ధకమైన ఆహారంతో పాటు మాంసాహారాన్ని కూడా ఇస్తుంటారు. ఒక్కో పందెం కోడి ధర వేల నుంచి లక్షల రూపాయల వరకు ఉంటుంది.కోడి కాళ్లకు కట్టే కత్తులను ప్రత్యేకంగా తయారు చేస్తారు. వీటిని 'కోడి కత్తులు' అంటారు. ఈ కత్తులు ఎంత పదునుగా ఉంటాయంటే.. తగిలితే క్షణాల్లో ప్రత్యర్థి కోడి ప్రాణాలు కోల్పోతుంది. పందెం రాయుళ్ల కోసం నిర్వాహకులు ప్రత్యేకంగా విందులు, విలాసాలు ఏర్పాటు చేస్తారు. తెలంగాణలోని భద్రాద్రి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాల నుంచి వందల సంఖ్యలో కార్లలో ధనవంతులు, వ్యాపారులు ఏపీకి తరలివెళ్లారు. కోడి పందాలు జరిగే చోట కేవలం పందాలే కాకుండా పేకాట, గుండాట వంటి ఇతర జూదాలు కూడా జోరుగా సాగుతున్నాయి. దీని వల్ల సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఒక్కో పందెంలో లక్షల రూపాయలు ఓడిపోవడంతో చాలా కుటుంబాలు అప్పుల పాలు అవుతున్నాయి. కొంతమంది తమ ఆస్తులను, భూములను కూడా అమ్మేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది.సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత ఈ జూదానికి బానిస అవుతున్నారు. ఇది వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. జూదంలో సంపాదనంతా పోవడంతో భార్యాభర్తల మధ్య గొడవలు రావడం, కుటుంబాలు విచ్ఛిన్నం కావడం వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. తెలంగాణ వైపు పోలీసులు అడుగడుగునా తనిఖీలు చేపట్టినప్పటికీ.. పందెం రాయుళ్లు దొడ్డిదారిన సరిహద్దులు దాటుతున్నారు.ఏపీ సరిహద్దుల్లో పోలీసులు పెద్దగా పట్టించుకోకపోవడంతో నిర్వాహకులు స్వేచ్ఛగా పందాలు నిర్వహిస్తున్నారు. ఇనుప తీగలతో కంచెలు వేసి, కేవలం డబ్బులు కాచే వారిని మాత్రమే లోపలికి అనుమతిస్తూ రహస్యంగా వ్యవహారాలు నడుపుతున్నారు. ఒక్క రోజులోనే సరిహద్దుల్లో సుమారు రూ. 5 నుంచి 10 కోట్ల వరకు చేతులు మారినట్లు అంచనా. సంప్రదాయం పేరుతో జరుగుతున్న ఈ జూదం వల్ల అనేక మంది సామాన్యులు వీధిన పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

# 600 కుక్కలను చంపేశారు...

కామారెడ్డి, జనవరి 16,తెలంగాణనుగ్భ్రాంతికి గురి చేసిన దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. కామారెడ్డి జిల్లాలోని మచ్చారెడ్డి మండల పరిధిలోని ఫరీద్‌పేట్, భవానిపేట్, వాడి, పలవంచ గ్రామాల్లో గత కొన్ని రోజులుగా 500 నుంచి 600 వరకు వీధి కుక్కలను విషం ఇచ్చి చంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ సామూహిక హత్యలకు ఆయా గ్రామాలకు ఎన్నికైన సర్పంచ్‌లే కుట్ర పన్నారని ఆరోపణలు ఉన్నాయి. 'గౌతమ్ స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్' ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.మచ్చారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో కుక్కల మృతదేహాలు ఒక్కసారిగా కనిపించడంతో కలకలం రేగింది. స్థానికుల కథనం ప్రకారం, ఇటీవల ఎన్నికైన సర్పంచ్‌లు ఎన్నికల సమయంలో వీధి కుక్కల సంఖ్య పెరగడం, గ్రామీణ ప్రాంతాల్లో వాటి బెడదను తగ్గించడానికి ఈ "షార్ట్‌కట్"ను ఎంచుకున్నారు. ఆహారంలో విషం కలిపి లేదా విషపూరిత ఇంజెక్షన్ల ద్వారా మూగజీవాలను దారుణంగా చంపారని, అనంతరం ఆధారాలు లేకుండా రహస్యంగా వాటి మృతదేహాలను పూడ్చిపెట్టారని తెలుస్తోంది.వీధి కుక్కల సమస్యపై సుప్రీంకోర్టు ఇటీవల స్పందిస్తూ, కుక్కలను చంపాలని తాము ఆదేశించలేదని, 'పశువుల జనన నియంత్రణ' నిబంధనల ప్రకారం వాటిని నిర్వహించాలని చెప్పింది. అయితే, పశువుల క్రూరత్వ నిరోధక చట్టం, 1960 ప్రకారం కుక్కలను ఇలా చంపడం అనైతికం మాత్రమే కాదు, శిక్షార్హమైన నేరం కూడా. కామారెడ్డి పోలీసులు ప్రాథమిక విచారణ ఆధారంగా సంబంధిత సర్పంచ్‌లు, వారి సహచరులపై భారతీయ న్యాయ స్మృతిలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

జంతు ప్రేమికుల సంఘం 'స్ట్రే యానిమల్స్ ఫౌండేషన్ ఇండియా' ప్రతినిధులకు ఈ విషయం తెలిసింది. వారు ఆ ప్రాంతంలో తిరిగి సమాచారం సేకరించారు. స్థానిక ప్రజలతో మాట్లాడిన తర్వాత భయంకరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఫౌండేషన్ అధికారి గౌతమ్ ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికైన ప్రతినిధులు చట్టాన్ని ఉల్లంఘించి ఈ నేరం చేశారని ఆయన ఆరోపించారు.తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల దాడులకు సంబంధించిన వార్తలు వస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అయితే, స్టెరిలైజేషన్, టీకాలు వంటి ప్రభుత్వ చర్యలు చేపట్టకుండా సామూహిక హత్యలకు పాల్పడటం అనేది దారుణమని, ఇది అధికార యంత్రాంగం వైఫల్యానికి నిదర్శనమని నిపుణులు భావిస్తున్నారు.

# సంక్షేమం సరే....ప్రజాసమస్యలు సంగతేంటీ

హైదరాబాద్, జనవరి 16, తెలంగాణలో ప్రస్తుతం సంక్షేమం వర్సెస్ అభివృద్ధి అనే అంశం హాట్ టాపిక్ గా మారుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తన ఆరు గ్యారెంటీల అమలుకు పెద్దపీట వేసింది. 2025-26 బడ్జెట్‌లో ఏకంగా రూ. 56,000 కోట్లను కేవలం ఈ గ్యారెంటీల కోసమే కేటాయించడం ప్రభుత్వ ప్రాధాన్యతలను స్పష్టం చేస్తోంది. అయితే, ప్రజలను నేరుగా ఆకట్టుకునే నగదు బదిలీ, ఉచిత పథకాలపై పెడుతున్న దృష్టి, రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన మౌలిక సదుపాయాల కల్పనపై తగ్గిపోతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రోడ్ల మరమ్మతులు, మురుగునీటి పారుదల వంటి ప్రాథమిక పనులు కూడా నిధుల లేమితో అగిపోవడం ప్రజల్లో అసంతృప్తికి కారణం అవుతోంది. ముఖ్యంగా గతంలో ఆర్భాటంగా ప్రకటించి శంకుస్థాపనలు చేసిన పలు ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఉదాహరణకు, ఓటూ రెండో దశ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తన వంతు వాటాగా ఇవ్వాల్సిన సుమారు రూ. 381 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆ ప్రాజెక్టు పట్టాలెక్కడం లేదు. అదేవిధంగా, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని పలు రైల్వే ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధుల బకాయిలు పెరిగిపోవడం వల్ల పనులు మందగించాయి. కేవలం రైల్వేలే కాకుండా, సాగునీటి రంగంలో అత్యంత కీలకమైన దేవాదుల వంటి ప్రాజెక్టులు నిధుల కొరత కారణంగా 2025 నాటికి పూర్తి కావాల్సిన గడువును దాటి 2027కు వాయిదా పడ్డాయి.ప్రభుత్వ వ్యూహం ప్రధానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం , పేదలకు తక్షణ ఊరటనివ్వడం చుట్టూ తిరుగుతోంది. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి వంటి పథకాలు లబ్ధిదారులకు మేలు చేస్తున్నా.. దీర్ఘకాలికంగా ఆదాయాన్ని సృష్టించే మౌలిక సదుపాయాల కల్పన అటకెక్కడం ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో, కొత్త పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీనివల్ల గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు సైతం నిలిచిపోయి, ప్రజలు రోజువారీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ , రీజినల్ రింగ్ రోడ్ వంటి భారీ ప్రాజెక్టుల గురించి మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూసేకరణ సవాళ్లు , నిధుల సమీకరణ పెద్ద అడ్డంకులుగా మారాయి. ఉస్మానియా ఆసుపత్రి కొత్త భవనం వంటి అత్యవసర ప్రాజెక్టుల విషయంలో శంకుస్థాపన చేసినా, అసలు పనులు ప్రారంభం కావడానికి నెలల తరబడి సమయం పడుతోంది. ఆరోగ్య, విద్యా రంగాల్లో మౌలిక వసతుల లేమిపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆరు గ్యారెంటీల అమలు కోసం చేస్తున్న అప్పులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే అవకాశం ఉండటంతో, భవిష్యత్తులో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం మరింత కష్టతరం కానుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. కేవలం సంక్షేమ పథకాలతోనే ఓటర్లను మెప్పించవచ్చని భావించడం ప్రభుత్వానికి రాజకీయంగా రిస్క్ తో కూడుకున్న వ్యవహారమే. ఎందుకంటే, ప్రజలు పథకాలతో పాటు మెరుగైన రోడ్లు, సాగునీరు, మౌలిక సదుపాయాలను కూడా కోరుకుంటారు. నిధులన్నీ పథకాలకే మళ్లిస్తూ, కంటికి కనిపించే అభివృద్ధిని విస్మరించడం వల్ల మధ్యతరగతి, పట్టణ ఓటర్లలో వ్యతిరేకత మొదలవుతోంది. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య సరైన సమతుల్యత పాటించకపోతే, అది రాబోయే రోజుల్లో ప్రభుత్వంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కియా సెలోస్ కొత్త మోడల్ కారును ఆవిష్కరించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ అన్ని వాహనాల కంపెనీలు తప్పని సరిగా సరికొత్త రీతిలో ఈవీ మోడల్స్ను మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రోస్పెరా కియా షోరూంలో కియా కంపెనీ ఎస్ యూవీ వినియోగదారుల కోసం రూపొందించిన కియా సెల్లోస్ కొత్త మోడల్ వాహనాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్ను కాలుష్య రహిత నగరంగా మార్చే క్రమంలో ఈవీ వాహనాలకు జీరో పన్ను రూపంలో ప్రోత్సహిస్తుందని కాలుష్య నివారణ కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. నగరవాసులు కూడా కాలుష్యరహితంగా ఉండే వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని అన్నారు.

## మంత్రి వివేక్ వెంకట స్వామిని నిలదీసిన మహిళలు

మంచిర్యాల మంత్రి వివేక్ వెంకటస్వామిని మహిళలు నిలదీసారు. చెన్నూరు మున్సిపాలిటీ పరిధిలోని 2 వ వార్డులో త్రాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని.. వెంటనే త్రాగు నీటి సమస్య పరిష్కరించాలని మంత్రిని నిలదీసారు.

# క్రిషాంక్ ఆశలమీద తలసాని నీళ్లు

హైదరాబాద్, జనవరి 16, భారత రాష్ట్ర సమితి రెండు పర్యాయాలు తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని చలాయించింది. రెండు పర్యాయాలు కూడా ప్రతిపక్షాన్ని తొక్కి అవతలపడేసింది. ఇతర పార్టీలో ఉన్న ఎమ్మెల్యేలను ఆపరేషన్ ఆకర్ష్ ద్వారా చేర్చుకుంది. 2023లో మాత్రం భారత రాష్ట్ర సమితి పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో వ్యతిరేకమైన ఫలితం వచ్చింది. హ్యాట్రిక్ సాధించాలని కలలు గన్న గులాబీ పార్టీకి చుక్కెదురైంది.ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉంది గులాబీ పార్టీ. పార్టీ అధికారం లేకపోయినప్పటికీ.. సోషల్ మీడియా మాత్రం బలంగా ఉంది. గులాబీ పార్టీ సోషల్ మీడియాను ఈ స్థాయిలో బలోపేతం చేసిన వ్యక్తుల్లో క్రిషాంక్ కచ్చితంగా ఉంటారు. ఈయన కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ అల్లుడు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిగా తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించారు. అనేక పర్యాయాలు జైలుకు కూడా వెళ్లి వచ్చారు. గులాబీ పార్టీకి కీలకమైన సమాచారం అందించడంలో ఈయన దిట్ట అని చెబుతుంటారు.క్రిషాంక్ కంటోన్మెంట్ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలవాలని భావిస్తున్నారు. 2023లో టికెట్ లభిస్తుందని అనుకున్నప్పటికీ అవకాశం రాలేదు. అప్పుడు గులాబీ పార్టీ సాయన్న కుమార్తెకు అవకాశం ఇచ్చింది. సాయన్న కుమార్తె చనిపోవడంతో.. మళ్లీ క్రిషాంక్ కు టికెట్ ఇస్తారని ప్రచారం జరిగింది. కానీ, ఈసారి కూడా రిక్త హస్తమే మిగిలింది. దీంతో క్రిషాంక్ ఎమ్మెల్యే ఆశలు నెరవేరలేదు.ప్రస్తుతం గులాబీ పార్టీలో సోషల్ మీడియాను ముందుండి నడిపిస్తున్నారు క్రిషాంక్. అయితే ఆయన ఎంతో శ్రమ పడుతున్నప్పటికీ.. గులాబీ పార్టీలో కొంతమంది వ్యక్తులు ఆయనను నాయకుడిగా చూడడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు క్రిషాంక్ కు టికెట్ లభించలేదు. అప్పుడు ఆయన మామ సర్వే సత్యనారాయణకు టికెట్ ఇచ్చారు. దీంతో దానిని కారణంగా చూపి క్రిషాంక్ గులాబీ పార్టీలో చేరారు. అక్కడ కూడా ఆయనకు అవకాశం లభించడం లేదు. సికింద్రాబాద్ నగరానికి సంబంధించి గులాబీ పార్టీని పర్యవేక్షిస్తున్న తలసాని శ్రీనివాస్ యాదవ్.. కంటోన్మెంట్ ఏరియా కు గులాబీ పార్టీకి సంబంధించి కొత్త బాధ్యులు వస్తారని ప్రకటించారు. ఆ సమావేశానికి క్రిషాంక్ ను పిలవలేదు. క్రిషాంక్ ఆశల మీద తలసాని శ్రీనివాస్ యాదవ్ నీళ్లు చల్లుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్రిషాంక్ పార్టీ కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. అనేక కేసులను ఎదుర్కొంటున్నారు. కొన్ని సందర్భాలలో దాడులకు కూడా గురయ్యారు. ఈ పరిణామాలు క్రిషాంక్ ను ఆవేదనకు గురి చేస్తున్నాయని అతడి అభిమానులు అంటున్నారు. ఆయన చేస్తున్న పోరాటానికి గుర్తింపు ఏ మాత్రం లభించడం లేదని అభిమానులు వాపోతున్నారు. కేటీఆర్ తో బలమైన బంధం ఉన్నప్పటికీ.. క్రిషాంక్ ను పార్టీ అధిష్టానం ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు. కేటీఆర్ మీద సంపూర్ణ విశ్వాసంతో ఉన్నానని అనేక సందర్భాలలో క్రిషాంక్ చెప్పారు. క్రిషాంక్ కు కూడా కేటీఆర్ హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీనికి తోడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కంటోన్మెంట్ విషయంలో వేలు పెట్టడంతో అసలు క్రిషాంక్ రాజకీయ భవిష్యత్తు ఏమిటో అర్థం కావడం లేదు.

## సికింద్రాబాద్ కార్పోరేషన్ కోసం ర్యాలీ
## మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సికింద్రాబాద్ శనివారం ఉదయం 9 గంటలకు సికింద్రాబాద్ అస్తిత్వం, ఆత్మగౌరవం పోరాటం ర్యాలీ జరుగుతుంది. రైల్వే స్టేషన్ నుంచి ఎంజిరోడ్ లోని గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇంటికి ఒకరు చొప్పున సికింద్రాబాద్ నివాసితులు రావాలి. 220 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రాంతం సికింద్రాబాద్. అనేక చారిత్రాత్మక ప్రదేశాలు సికింద్రాబాద్ లో ఇమిడి ఉన్నాయి. లష్కర్ బోనాలకు పెద్ద చరిత్ర ఉంది. సికింద్రాబాద్ ను నామరూపాలు లేకుండా చేయాలని ప్రభుత్వం చూస్తోందని అన్నారు.కమిషనరేట్ లు అక్రమంగా కలిపారు. ఎందుకు కలిపారో చెప్పాలి. రేపు అన్ని రంగాల సంఘాలు పాల్గొనాలి. ఈ ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఇదే మంచి సమయం. రేపు కార్యక్రమానికి బీ ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సహా ఎమ్మెల్యేలు కూడా వస్తున్నారు.

సికింద్రాబాద్ పేరు మార్చేందుకు కుట్ర జరుగుతుంది. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారం లోకి వచ్చారు. ఆ హామీలు అమలు చేయకుండా పేర్లు ఊర్లు మారుస్తూ తుగ్లక్ పాలన చేస్తున్నారు. లష్కర్ సాధన సమితి రెండేళ్లుగా అడుగుతున్నాం.

సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం అందరూ కలిసి రావాలని అన్నారు.అన్ని రాజకీయ పార్టీలు కచ్చితంగా ఈ కార్యక్రమం లో పాల్గొనాలి. ఇది శాంతియుత ర్యాలీ. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే కోర్టు నుంచి అనుమతి తీసుకుంటాం. కార్యక్రమం విజయవంతం చేస్తామని అన్నారు.

## సీఎంఆర్ క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన మల్లారెడ్డి

మేడ్చల్ మేడ్చల్ లోని ఎల్లంపేట అలియాబాద్ మూడు చింతలపల్లి మూడు మున్సిపాలిటీల్లో మూడు రోజులు సీఎంఆర్ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్ను మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డి ప్రారంభించారు. మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలో క్రికెట్ పోటీ నిర్వహిస్తున్న గ్రౌండ్లో మాజీ మంత్రి మల్లారెడ్డి బౌలింగ్ చేయగా మల్లారెడ్డి చిన్న కొడుకు భద్రారెడ్డి బ్యాటింగ్ చేసి హల్చల్ చేశారు.ఎల్లంపేట మున్సిపల్ గ్రౌండ్లో మల్లారెడ్డి బ్యాటింగ్ చేస్తూ సందడి చేశారు.మూడు రోజులు యువత క్రికెట్ టోర్నమెంట్లో ఆడిన అనంతరం ఫైనల్ విజేతలను ఎంచుకొని బహుమతులు అందజేస్తామని తెలిపారు...

## సంక్రాంతి పండుగ లో దొంగల హల్చల్
## మేడిపల్లిలో పంజా విసిరిన దొంగల ముఠా

మేడ్చల్ జిల్లా మేడిపల్లి లోని చెంగిచెర్ల లో భారీ చోరీ జరిగింది. 12 ఇళ్లల్లో చోరీలకు దొంగల ముఠా పాల్పడింది. శుక్రవారం తెల్లవారు 2:30 ఘటన జరిగింది. దొంగలు చేతిలో కత్తులతో చెంగిచెర్ల కాలనీలో సంచారం చేసారు. ముందే రెక్కి చేసి కారులో వచ్చి చోరీలకు పాల్పడ్డారు. పలు ఇళ్లలో చోరీ, అనంతరం ఎస్కేప్ అయ్యారు. బాధితులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఘటన స్థలానికి చేరుకున్న క్లూస్ టీమ్ ఉ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## ఈద్గా సమస్యలను పరిష్కరిస్తాం ఎంపి చిన్ని

విజయవాడ పశ్చిమ నియోజకవర్గం విద్యాధరపురం షాదీ ఖానా, ఈద్గా ప్రాంగణాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) పరిశీలించారు. షాదీ ఖానా, ఈద్గా సమస్యలను ఎంపీ కేశినేని శివనాథ్ కి ఈద్గా కమిటీ విన్నవించింది.ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఈద్గా కమిటీ ఆహ్వానం మేరకు పరిశీలనకు రావటం జరిగింది. బరియల్ గ్రౌండ్ సమస్య, షాదీ ఖానా ఆధునీకరణ తదితర సమస్యలను తెలియజేశారు . త్వరితగతన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని అన్నారు.వక్ఫ్ బోర్డు తో మాట్లాడి నిధుల సేకరణతో పాటుగా ఎంపీ నిధులనుంచి అభివృద్ధి పనులకు కేటాయింపులు చేస్తాం. పశ్చిమ నియోజకవర్గంలో మసీదుల కమిటీలను సమన్వయం చేసుకొని రాజకీయాలకు అతీతంగా ఈద్గా, షాది ఖానా అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు.

## గోదావరి ఇసుక అక్రమాలపై చర్యలు తీసుకోవాలి:
## పూనం సరోజ డిమాండ్...!



భద్రాద్రి కొత్తగూడెం మణుగూరు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఇసుక వ్యాపారాన్ని అక్రమంగా నిర్వహిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ఒక బడా కాంట్రాక్టర్ దోచుకుంటున్నాడని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనం సరోజ ఆరోపించారు. స్థానిక రేణుక అక్షర మహిళ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.కొన్ని సంవత్సరాలుగా సదరు కాంట్రాక్టర్ సొసైటీ సభ్యుల పేర్లతో టెండర్లు వేయించి, వాటి ముసుగులో మొత్తం ఇసుక వ్యాపారాన్ని తన ఆధీనంలో కొనసాగిస్తున్నాడని ఆమె తెలిపారు. సభ్యులకు “గుడ్‌విల్” పేరుతో స్వల్ప మొత్తాలు మాత్రమే ఇచ్చి, మిగిలిన కోట్ల రూపాయల ఆదాయాన్ని స్వంతంగా మలుచుకుంటున్నాడని విమర్శించారు.ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ పన్నును ఎగవేస్తూ రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం కలిగించాడని, ఇది తీవ్రమైన నేరమని పేర్కొన్నారు. సొంత లారీలను ఉపయోగిస్తూ, ఇతరుల పేర్లతో నకిలీ వే?బిల్లులు సృష్టించి హైదరాబాద్‌కు ఇసుక తరలిస్తూ అక్రమంగా కోట్ల రూపాయలు సంపాదిస్తున్నాడని ఆరోపించారు.ఈ అక్రమ ఇసుక దందాపై మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పూనం సరోజ డిమాండ్ చేశారు. నిజాలు వెలుగులోకి వస్తే ఈ అక్రమాల వెనుక ఉన్న పెద్దల పేర్లు బయటపడతాయని ఆమె అన్నారు. గోదావరి ఇసుక ప్రజల సంపదని, దోపిడీని వెంటనే అరికట్టాలని కోరారు.జిల్లాలో కొనసాగుతున్న ఇసుక అక్రమాలపై ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి, గత ఐదేళ్ల లావాదేవీలను ఆడిట్ చేయాలని ప్రభుత్వాన్ని ఆమె విజ్ఞప్తి చేశారు. అక్రమాలపై చర్యలు తీసుకోకపోతే రేణుక అక్షర మహిళా మండలి సభ్యులతో కలిసి ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రేణుక అక్షర మహిళా మండలి సభ్యులు కోరి శ్యామల, కన్నాపురం వసంత, దేరంగుల సుజాత, రెడ్డిబోయిన రేణుక, కన్నాపురం శైలజ, సౌజన్య డాకూరి తదితరులు పాల్గొన్నారు.

## “దేశ భాషలందు తెలుగు లెస్స” అంటూ.. తెలుగు భాష, జాతి, వైభవాన్ని, ప్రపంచం నలుమూలల తెలియజెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు అఖండ భారత మహా చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు

## -నేడు ఆయన జయంతి



దేశ భాషలందు తెలుగు లెస్స” అంటూ.. తెలుగు భాష, జాతి, వైభవాన్ని, ప్రపంచం నలుమూలల తెలియజెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు అఖండ భారత మహా చక్రవర్తి శ్రీ కృష్ణ దేవరాయలు..శ్రీ కృష్ణదేవ రాయలు అత్యంత ప్రసిద్ధ విజయనగర సామ్రాజ్య చక్రవర్తి. సాళువ నరసనాయకుడి వద్ద మహాదండనాయకుడుగా పనిచేసిన తుళువ నరసనాయకుని మూడవ కుమారుడు శ్రీకృష్ణదేవరాయలు. నరసనాయకుడు పెనుకొండలో ఉండగా, రెండవ భార్య నాగలాంబకు 17 జనవరి1471నజన్మించాడు కృష్ణదేవరాయలు. ఈయన పాలనలో విజయనగర సామ్రాజ్యము అత్యున్నతస్థితికి చేరుకున్నది. కృష్ణరాయలను తెలుగు మరియు కన్నడ ప్రజలు భారతదేశాన్ని పాలించిన గొప్ప చక్రవర్తులలో ఒకడిగా అభిమానిస్తారు. సాహిత్యములో ఈయన ఆంధ్ర భోజుడుగా మరియు కన్నడ రాజ్య రమారమణగా కీర్తించబడినాడు. రాయలకు ప్రధాన మంత్రి తిమ్మరుసు. శ్రీకృష్ణదేవరాయలు సింహాసనం అధిష్ఠించడానికి తిమ్మరుసు చాలా దోహదపడడినాడు. కృష్ణరాయలు తిమ్మరుసును పితృసమానునిగా గౌరవించి “అప్పాజీ” (తండ్రిగారు) అని పిలిచేవాడు.రాయలు, తుళువ నరస నాయకుని రెండవ భార్య అయిన నాగలాంబ (తెలుగు ఆడపడుచు) కుమారుడు. ఇతను ఇరవై సంవత్సరాల వయసులో ఫిబ్రవరి 4, 1509న విజయనగర రత్నసింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతని పట్టాభిషేకానికి అడ్డురానున్న అచ్యుత రాయలు నూ, వీర నరసింహ రాయలు నూ, అనుచరులనూ తిమ్మరుసు సుదూరంలో ఉన్న దుర్గములలో బంధించాడు. రాయలు తల్లి నాగలాంబ గండికోటను పాలించిన పెమ్మసాని నాయకులు ఆడపడచు. 240 కోట్ల వార్షికాదాయము ఉంది. రాయలు విజయనగరాధీశులందరిలోకీ చాలా గొప్పవాడు, గొప్ప రాజనీతిజ్ఞుడు, సైనికాధికారి, భుజబల సంపన్నుడు, ఆర్థిక వేత్త, మత సహనము కలవాడు, వ్యూహ నిపుణుడు, పట్టిన పట్టు విడువని వాడు, కవి పోషకుడు, రాజ్య నిర్మాత మొదలగు సుగుణాలు కలవాడు. ఇతను దక్షిణ భారతదేశం మొత్తం ఆక్రమించాడు.కృష్ణదేవరాయలు స్వయంగా కవిపండితుడు కూడా కావడంతో ఇతనికి సాహితీ సమరాంగణ సార్వభౌముడు అని బిరుదు. ఈయన స్వయంగా సంస్కృతంలో జాంబవతీ కళ్యాణము, మదాలసాచరితము, స త్య వ ద. ా వ రి ణ య ం వ ం ం , సకలకథాసారసంగ్రహము, జ్ఞానచింతామణి, రసమంజరి తదితర గ్రంథములు, తెలుగులో ఆముక్తమాల్యద లేక గోదాదేవి కథ అనే గ్రంథాన్ని రచించాడు. తెలుగదేల యన్న దేశంబు తెలుగేను తెలుగు రేడ నేను తెలుగొకొండ ఎల్ల జనులు వినగ ఎరుగవే బాసాడి దేశభాష లందు తెలుగు లెస్స అన్న పలుకులు రాయలు వ్రాసినవే. రాయల ఆస్థానానికి భువన విజయము అని పేరు. భువనవిజయంలో అల్లసాని పెద్దన, నంది తిమ్మన, ధూర్జటి, మాదయ్యగారి మల్లన (కందుకూరి రుద్రకవి), అయ్యలరాజు రామభద్రుడు, పింగళి సూరన, రామరాజభూషణుడు (భట్టుమూర్తి), తెనాలి రామకృష్ణుడు అనే ఎనిమిది మంది కవులు ఉండేవారని ప్రతీతి. వీరు అష్టదిగ్గజములుగా ప్రఖ్యాతి పొందారు.కృష్ణదేవ రాయలు తక్కిన విజయనగర రాజులలాగే వైష్ణవుడు. కానీ పరమతసహనశీలుడు. అనేక వైష్ణవాలయాలతో పాటు శివాలయాలను నిర్మించాడు. అంతేకాక ధూర్జటి, నంది తిమ్మన వంటి పరమశైవులకు కూడా తన సభలో స్థానం కల్పించాడు. అనేక దాన ధర్మాలు చేసాడు. ముఖ్యంగా తిరుమల శ్రీనివాసులకు పరమ భక్తుడు, సుమారుగా ఆరు పర్యాయములు ఆ దేవదేవుని దర్శించి, అనేక దానధర్మాలు చేశాడు. ఇతను తన కుమారునికి తిరుమల దేవ రాయలు అని, కుమార్తెకు తిరుమలాంబ అని పేర్లు పెట్టుకున్నాడు.ఈయన చెన్నకేశవస్వామి వారి దేవాలయం కట్టించాడు.కృష్ణదేవ రాయలుకు తిరుమల దేవి, చిన్నాదేవి ఇద్దరు భార్యలని లోక విదితము. కానీ, ఆముక్తమాల్యద ప్రకారం ఈయనకు ముగ్గురు భార్యలు (తిరుమలాదేవి, అన్నపూర్ణ మరియు కమల). కృష్ణదేవరాయలు విజయనగర సామంతుడైన శ్రీరంగపట్నం రాజు కుమార వీరయ్య కూతురు తిరుమలాదేవిని 1498లో వివాహం చేసుకున్నాడు.పట్టాభిషిక్తుడైన తర్వాత రాజనర్తకి అయిన చిన్నాదేవిని వివాహమాడాడని ప్రతీతి. ప్రతాపరుద్ర గజపతిని ఓడించి, ఆయన కూతురైన తుక్కా దేవిని మూడవ భార్యగా స్వీకరించాడటనటానికి చారిత్రకాధారాలున్నాయి. ఈమెనే కొందరు లక్ష్మీదేవి అని, జగన్మోహిని అని కూడా వ్యవహరించారు. కృష్ణరాయలకు అన్నపూర్ణమ్మ అనే నాలుగవ భార్య ఉందని భావించాడు. కానీ, చిన్నాదేవే అన్నపూర్ణమ్మ అని కొందరి అభిప్రాయం. కొందరికి పరిశోధనల ప్రకారం కృష్ణరాయలకు పన్నెండు మంది భార్యలు. అందులో తిరుమలాదేవి, చిన్నాదేవి, జగన్మోహిని ప్రధాన రాణులని చెప్పవచ్చు. అయితే శాసనాల్లో ఎక్కువగా ప్రస్తావించబడిన తిరుమలాదేవి పట్టపురాణి అయిఉండవచ్చని చరిత్రకారుల అభిప్రాయం.ఇద్దరు కుమార్తెలు, వారిలో పెద్ద కూతురు తిరుమలాంబను ఆరవీడు రామ రాయలకు, చిన్న కూతురును రామ రాయలు సోదరుడైన తిరుమల రాయలుకు ఇచ్చి వివాహం చేసాడు. ఒక్కడే కొడుకు, తిరుమల దేవరాయలు. ఇతనికి చిన్న తనంలోనే పట్టాభిషేకం చేసి, తానే ప్రధానిగా ఉండి రాజ్యవ్యవహారాలు చూసుకునేవాడు. కాని దురదృష్టవశాత్తూ తిరుమల దేవ రాయలు 1524లో మరణించాడు. ఈ విషయంపై కృష్ణ దేవ రాయలు తిమ్మరుసును అనుమానించి, అతనిని గ్రుడ్డివానిగా చేసాడు. తానూ అదే దిగులుతో 17 అక్టోబర్ 1529న 58 సంవత్సరాల వయస్సులో మరణించినాడని చరిత్రకారుల అభిప్రాయము. మరణానికి ముందు చంద్రగిరి దుర్గమునందున్న సోదరుడు, అచ్యుత రాయలును వారసునిగా చేసాడు.

## సెంటినరీ కాలనీ లయన్స్ క్లబ్ 11 అవార్డులు.




కమాన్ పూర్ రామగిరి మండలంలోనిలయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీకి 11 అవార్డులు వచ్చినట్లుక్లబ్ సభ్యులు, దాతల సహకారంతోనే ఈ విజయం సాధించినట్లు అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ తెలిపారు.లయన్స్ ఇంటర్నేషనల్ రీజియన్?8 ఆధ్వర్యంలో బొంతకుంటపల్లి లోని ఫోటో ఫామ్ ? విజయ ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి హోస్ట్ క్లబ్‌గా రీజియన్ మీట్ ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి రీజియన్ చైర్‌పర్సన్ లయన్ రేకులపల్లి శశాంక అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్ “ఆర్ట్ ఆఫ్ పేరెంటింగ్” అంశంపై లయన్స్ కుటుంబాలు మరియు పిల్లల కోసం అవగాహన కార్యక్రమం నిర్వహించి, పిల్లలను ఇతరులతో పోల్చకూడదని, విలువలు నేర్పాలని, భోజనం సమయంలో టీవీ చూడకూడదని, బెడ్‌రూమ్‌లో సెల్‌ఫోన్ వాడకూడదని సూచించారు.అనంతరం జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ 114 సేవా కార్యక్రమాల ద్వారా సుమారు 7,000 మందికి సేవలు అందించి, రీజియన్‌లోని 7 క్లబ్బులలో రెండవ ఉత్తమ క్లబ్‌గా నిలిచి 2వ బెస్ట్ క్లబ్ ఆఫ్ ది రీజియన్ అవార్డు గెలుచుకుంది. క్లబ్ అధ్యక్షుడు లయన్ మేకల మారుతి యాదవ్‌కు ఉత్తమ అధ్యక్షుడు, కార్యదర్శి లయన్ అబ్బు కేశవ రెడ్డికి ఉత్తమ కార్యదర్శి అవార్డులు లభించాయి.క్లబ్‌కు మొత్తం 11 కేటగిరీలలో అవార్డులు లభించాయి. వాటిలో ఉత్తమ అవసర ఆధారిత సేవా కార్యక్రమాలు, ఉత్తమ పర్యావరణ కార్యక్రమాలు, ఉత్తమ ప్రతిష్టా నిర్మాణ కార్యక్రమాలు మొదటి బహుమతులు కాగా, ఉత్తమ విజన్ కార్యక్రమాలు, ఉత్తమ బాల క్యాన్సర్ సేవా కార్యక్రమాలు, ఉత్తమ లయన్స్ క్లబ్, ఉత్తమ క్లబ్ కార్యదర్శి రెండవ బహుమతులు సాధించాయి. అలాగే ఉత్తమ మధుమేహ శిబిరం, యువజన కార్యక్రమాలు, ఉత్తమ క్లబ్ అధ్యక్షుడు, ఉత్తమ ఆకలి నివారణ కార్యక్రమాలు మూడవ బహుమతులను ముఖ్య అధితి మోటివేషనల్ స్పీకర్ సంద్ర సుధీర్ రీజినల్ చైర్మన్ శశాంక,జోనల్ చైర్మన్ సాదుల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది.అనంతరం క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతి యాదవ్ మాట్లాడుతూ ఈ విజయానికి ప్రధాన కారణం క్లబ్ సభ్యులు, దాతల సహకారమేనని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల కోసం ముందుండి సేవలందిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి అబ్బు కేశవ రెడ్డి, డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి, గుండ శ్రీనివాస్, సభ్యులు మేకల గణేష్, బేరి కుమార్, జంగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ఇంగ్లాండ్ లో పట్టా పొందిన విద్యార్థికి సన్మానం.



కమాన్ పూర్ పాలకుర్తి మండలంజీడి నగర్ నగర్ కు చెందిన చింతకింది కిరణ్ కుమార్ ను ఘనంగా సన్మానించారు. జీడి నగర్ గ్రామ పంచాయతీ బీసీ కాలనీ చెందిన చింతకింది కిరణ్ కుమార్ పంజాబ్ లవ్లి ప్రొఫెషనల్ యూనివర్సిటీలో మాజీ ప్రధాని మేరీ ఎలిజిబెత్ ట్రస్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా జీడి నగర్ గ్రామపంచాయతీ నాల్గవ వార్డు సభ్యులు కాంకటి శ్రీనివాస్ .కన్నాల మాజీ ఉప సర్పంచ్ పుట్ట రంజిత్ బండారి రాజు,దాసరి సాగర్ దేగల సంతోష్,బైరి రాజేశం వారికి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కంకటీ శ్రీనివాస్ మాట్లాడుతూ, క్రమశిక్షణ మరియు పట్టుదలతో శ్రమించి ఉన్నత శిఖరాలను అధిరోహించిన చింతకింది కిరణ్ కుమార్ నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. వారికృషి సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.చింతకింది కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. తన ఎదుగుదలకు సహకరించిన తల్లిదండ్రులకు, గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిదని ఆనందం వ్యక్తం చేశారు.

# మినీ మేడారం జాతరకు ఏర్పాట్లు చేయాలి.

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులతో మినీ మేడారం జాతరల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంగణంలో పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. జాతరలు జరిగే మార్గాల్లో రోడ్లకు ఇరువైపుల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, మూల మలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర జరిగే ప్రదేశాలను పరిశీలించి చేయాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతరలు నిర్వహించే మండలాల్లో మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, భూపాలపల్లి మండలంలో కమలాపూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగు తున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మినీ మేడారం జాతరలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# జగ్గన్నతోట ప్రభల తీర్థం

## శుభకాంక్షలు తెలియచేసిన సీఎం చంద్రబాబు



అమరావతి కోనసీమలోని జరుగుతున్న జగ్గన్నతోట ప్రభల తీర్థం సందర్భంగా భక్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియచేసారు. . 476 సంవత్సరాలుగా ఎంతో ప్రశస్తమైన జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగ హోదా కల్పించింది. జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఈ ప్రభల తీర్థం సమయంలో లోక కళ్యాణార్థమై ఏకాదశ రుద్రులు ఇక్కడ సమావేశమవుతారని అందరి విశ్వాసమని అన్నారు. . దాదాపు 5 లక్షల మంది హాజరయ్యే ఈ వేడుకకు రాష్ట్ర పండుగ హోదా కల్పించడం ద్వారా ప్రభుత్వ పరంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతాయి. ఉత్సవం వైభవంగా జరగాలని కోరుకుంటూ....అందరికీ మంచి జరగాలని ప్రార్థిస్తున్నానని అయన అన్నారు.

# బందరులో హోరాహోరిగా పందాలు

మచిలీపట్నంలో కోడి పందాలు, జూద క్రీడలు హోరాహోరీగా సాగాయి. నగర వాసులు బరుల వద్దకు దారి పట్టారు. పందెలను ఆసక్తిగా తిలకించి ఎంజాయ్ చేసారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మచిలీపట్నంలో భారీ స్థాయిలో బరుల ఏర్పాటు జరిగింది. మంగినపూడి బీచ్ రోడ్డులోనే పది వరకు బరుల ఏర్పాటు చేసారు. గ్రామ గ్రామాన రాత్రి పగలు తేడా లేకుండా పేకాట సాగాయి. కోడి పందాలు, జూద క్రీడల్లో కోట్లాది రూపాయలు చేతులు మారాయి. యాధావిధిగా నిర్వహకులు పందెపు రాయుళ్లను దోచేస్తున్నారు. పందెంలో 10 నుండి 20% వరకు వసూళ్లు చేసారు. చివరి రోజు కావడంతో కోడి పందాలు చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.

## సంక్రాంతి వేడుకల్లో మంత్రి డ్యాన్స్

ధర్మవరం సంక్రాంతి వేడుకల్లో మంత్రి సత్యకుమార్ డ్యాన్స్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువతతో కలిసి చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలోని 'మెగా విక్టరీ మాస్' సాంగ్‌కు స్టెప్పులేశారు. ఆయన డ్యాన్స్ చూసి స్థానికులంతా ఈలలు, కేకలు వేశారు.మంత్రి డ్యాన్సులతో పండుగ ఉత్సవాల్లో జోష్ నింపి అందర్నీ ఆకర్షించారు.

# సంక్రాంతి పండగల లాభం: మణుగూరు షాపులు ధరల జోరాటం...

## కూరగాయల ధరల అదుపు తప్పిపోతుందా...?

## పండగల్లో ప్రజల అవసరం పై లాభ పాట...

## మణుగూరులో కూరగాయల ధరల దోపిడి పై సామాజిక కార్యకర్త న్యాయవాది కర్నే రవి ఆగ్రహం...



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో కూరగాయల ధరల పేరుతో షాప్ యజమానులు సామాన్య ప్రజలను దోచుకుంటున్నారంటూ తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం సంక్రాంతి, కనుమ పండుగలను ఆసరాగా చేసుకుని "పాట కొట్టు"ల పేరుతో కూరగాయల ధరలను విపరీతంగా పెంచారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాల్లో కిలో టమాటా రూ.20కే లభిస్తుండగా, మణుగూరులో మాత్రం అర కిలో టమాటాను రూ.30కు విక్రయించారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పండుగల సమయంలో ప్రజల అవసరాన్ని అవకాశంగా మలుచుకుని వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు వసూలు చేస్తున్నారని మండిపడుతున్నారు.ఇదివరకు కూడా ఇదే తరహా ధరల దోపిడీ జరగడంతో భద్రాచలం ఐటిడిఏ పీవోకు, కలెక్టరేట్‌కు ఫిర్యాదులు అందినట్లు సమాచారం. అప్పట్లో కొద్ది రోజుల పాటు నియంత్రణ కనిపించినప్పటికీ, ప్రస్తుతం మళ్లీ "పాట కొట్టు"లను ఏర్పాటు చేసి అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ అంశంపై మణుగూరు మున్సిపల్ కమిషనర్, భద్రాచలం ఐ టి డి ఎ పిఓ, జిల్లా కలెక్టర్ వద్ద ఎన్నో సార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకోకపోవడంతోనే వ్యాపారులు ఈ దోపిడీకి పాల్పడుతున్నారని సామాజిక కార్యకర్త, న్యాయవాది కర్నే రవి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అన్యాయంపై ఈ నెల 29న హైదరాబాద్‌లో మణుగూరు మున్సిపల్ సంబంధిత ఉన్నతాధికారులకు సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరిస్తున్నారు. వెంటనే ధరల నియంత్రణ పై కఠిన చర్యలు చేపట్టి సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# డీసీసీబీ చైర్మన్ మంజూరు సూర్యనారాయణ రెడ్డి ఉదారత పలువురికి ఆర్థిక సహాయం



బద్వేలు కలసపాడు మండలం, కలసపాడు లోని యాదవ కాలనీకి చెందిన లక్క గుర్రమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని15000 రూపాయలు ఆర్థిక సహాయం చేసి ధైర్యం చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు అలాగే బద్వేల్ నియోజకవర్గం కలసపాడు లోని కొత్త కొట్టాలు కాలనీకి చెందిన షేక్ మహమ్మద్ గుండె సమస్య కారణంగా బైపాస్ సర్జరీ చికిత్స పొంది, ప్రస్తుతం వారి నివాసములో విశ్రాంతి తీసుకుంటున్నారు.ఈ విషయం తెలుసుకున్న ×కడప డిసిసి బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేసి ధైర్యం చెప్పడం జరిగింది.వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించడమైనది.ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# చందర్లపాడులో బరుల ఏర్పాటు..జోరుగా పందాలు, గుండాట పట్టించుకోని అధికారులు

నందిగామ సంక్రాంతి సంబరాల పేరుతో నందిగామ నియోజకవర్గంలో జోరుగా కోడి పందేలు, గుండాట, రంగాట, నెంబర్లాట నిర్వహించారు...చందర్లపాడు మండలపరిదిలోని చందర్లపాడు గ్రామంలోపొలాల్లో బరులుఏర్పాటు నిర్వహించారు. కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామంటూ ఊదరగొట్టిన అధికారులు ఆచూకీ లేరు. నందిగామ మండల పరిధిలోని ఐతవరం రామిరెడ్డిపల్లిమామిడి తోటల్లో భారీ బరులుఏర్పాటు చేసి పందేలు వేశారు. రూ. లక్షల్లో చేతులు మారుతున్నాయి. బరుల వద్ద రంగాట, నెంబర్లాట, గుండాట వంటి జూదంలో పలువులు జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. కంచికచర్ల మండు కీసర కోడి పందేల బరి వద్ద బులెట్ 30 కోడి పందేలలో ఎవరు ఎక్కువ గెలిచిన వారికి బులెట్ బహుకరించడం జరుగుతుందని బహిరంగంగా పెట్టినా అధికారులు న పట్టించుకోలేదు.

# మళ్లీ పట్నం బాట పట్టిన ఏపీ ప్రజలు



హైదరాబాద్ జనవరి 16సంక్రాంతి సంబురం ఇవాల్టితో ముగుస్తుంది. ఇక ఏపీలోని సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు మళ్లీ పట్నం బాట పట్టనున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ – విజయవాడ హైవేపై రద్దీని తగ్గించేందుకు నల్గొండ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టారు.హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై చిట్యాల, పెద్ద కాపర్తి వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతుండటతంతో ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశం ఉన్నందున దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ప్రయాణికులు, వాహనదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

# 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా టికెట్ కోసం ఉల్లెంగ నాగరాజు దరఖాస్తు



**ప్రజాబలం ప్రతినిధి:** నిజామాబాద్ జనవరి 16ఉల్లెంగ నాగరాజు 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మన నిజామాబాద్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఐన నాగరాజు బొబ్బిలి వీధి ఎల్లమ్మ గుట్ట మాజీ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ గా పనిచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పి.ప్రదీప్ , కిరణ్ తదితరులు ఆయనకు మద్దర్టు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన నిజామాబాద్ నాయకులకు, ప్రజలకు, 47 డివిజన్ ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# మున్సిపల్ చైర్మన్లను, నగర మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకోవాలి

**స్థానిక ప్రభుత్వాలపై చిన్న చూపు తగదు.**

**ఎన్నికల అనంతరం జరిగే పదవుల బేర సారాలకు స్వస్తి పలకండి**

**పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఈనాటికి కూడా స్పందన లేకపోవడం విడ్డూరం.**

**లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు -తుమ్మనపల్లి శ్రీనివాసు డిమాండ్.**




**ప్రజాబలం ప్రతినిధి:** హైదరాబాద్ జనవరి 16 ;రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల పదవీ కాలం ఈ నెల చివరి వారంతో పదవీ కాలం పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు కావొస్తుందని ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే నగరానికి మేయర్ ను, మున్సిపల్ పట్టణాలకు చైర్మన్ లను ప్రజలే ప్రత్యక్ష ఎన్నికల ద్వారానే ఎన్నుకొనేల చర్యలు తీసుకోవాలని లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మనపల్లి శ్రీనివాసు అన్నారు. గతంలో ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించాలని బహిరంగ లేఖ ద్వారా ఈ-మెయిల్ ద్వారా ముఖ్యమంత్రిని కోరామని అయినా ఈనాటి వరకు ప్రభుత్వం స్పందిచక పోవడం స్థానిక ప్రభుత్వాల పట్ల నిర్లక్ష ధోరణి స్పష్టమైందని ఆయన అన్నారు. ప్రత్యక్ష ఎన్నికల విధానం కొత్తదేమి కాదని గతంలో మూడు సార్లు 1987 -1992, 1992 - 1997 మరియు 1997 - 2002 వరకు మున్సిపల్ చైర్మన్ పదవికి గ్రామ సర్పంచ్ మాదిరిగా పట్టణ ప్రజలు ప్రత్యక్షంగా చైర్మన్ ని ఎన్నుకొనేవారని అదే విధంగా నగర మేయర్ ని ప్రత్యక్షంగా నగర ప్రజలు ఎన్నుకొనేవారని అయితే గత ప్రభుత్వాల కుట్ర, స్వార్థ, ధన రాజకీయాల మూలంగా అధికార క్రీడల నేపథ్యంలో చైర్మన్ పదవులు వేలం పాటలకు దారితీశాయని స్థానిక ప్రభుత్వాల మనుగడ ప్రశ్నార్థకం అయ్యిందని ఇక ఎంత మాత్రం రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించాల్సిన అవసరం లేదని త్వరలో జరిగే ఎన్నికలలో మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్లను, నగర కార్పొరేషన్ మేయర్లను ప్రత్యక్షంగా ప్రజలే ఎన్నుకొనేలా చర్యలు తీసుకోవాలని తుమ్మనపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో బహిరంగ లేఖ ద్వారా సైతం ముఖ్యమంత్రిని కోరామని ఈనాటి వరకు కూడా ప్రభుత్వం స్పందించకపోవడం విడ్డురంగా ఉందని ఆయన అన్నారు.

# సాయిపేట్ గ్రామంలో వాలీబాల్ టోర్నమెంట్ క్రీడాకారులకు బహుమతులు అందజేశారు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** వట్టిపల్లి మండలంలోని సాయిపేట గ్రామంలో,కార్చేల్ల సంగమేశ్వర్, నల్లవల్లి అడిగప్ప, ఆలూరి వీరన్న, కలాలి యాదవ్ గౌడ్, వీరి ఆధ్వర్యంలో, విలేజ్ వాలీబాల్ టోర్నమెంట్, ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, యువత క్రీడల్లో రాణించి, అద్భుతమైన ప్రతిభ చూపితే, గ్రామానికి మంచి పేరు, గుర్తింపు ప్రఖ్యాతలు వస్తాయని, మరియు ముందు తరం యువతకు, దిశా నిర్దేశం అవుతుందన్నారు, గ్రామ సర్పంచి ఆలూరి సంతోష-ఆంజనేయులు క్రీడాకారులను అభినందించి,టాస్ వేసి, తొలి ఆటను సర్వీస్ చేసి, యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు, మొత్తం ఐదు జట్లు పోటీకి ఎంటర్ అయ్యాయి, ప్రథమ బహుమతిగా, రూ, 6000, రెండవ బహుమతిగా రూ, 4000, క్రీడాకారులకు అందజేశారు, ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలతో పాటు, యువకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.......



**నిర్మల్ ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 16, 2026-నిర్మల్ జిల్లానిర్మల్ జిల్లాలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా సాగేందుకు సహకరించిన జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, కిందిస్థాయి సిబ్బందికి, పోలీసు శాఖకు, బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలకు, అలాగే సహకరించిన ప్రజా ప్రతినిధులకు కలెక్టర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# అత్త మామ లను ఇంటి నుండి బయటకు గెంటి వేసిన కోడలు

**సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్న వెల్దుర్తి పోలీసులు**

**బాధితురాలు జయమ్మ సమస్య పరిష్కారించాలి**

**ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక డిమాండ్**




**ప్రజాబలం ప్రతినిధి:** కర్నూల్ జనవరి 16 ;అత్తమామలను, తోడికోడలును ఇంటి నుండి బయటకు గెంటి వేసి అత్త పై దౌర్జన్యం చేస్తున్న కోడలు తీరుపై చర్యలు చేపట్టాలని ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీ మహిళా ఐక్య వేదిక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి డిమాండ్ చేసింది వివరాల్లోకి వెళితే వెల్దుర్తి మండలం రామళ్ళకోట గ్రామంలో నివాసం వుంటున్న జయమ్మ వెంకటేశ్వర్లు దంపతులకు ముగ్గురు కుమారులు ఒక కూతురు సంతానం. జయమ్మ తన మూడవ కుమారుడు కుమారస్వామికి ప్యాపిలి మండలం వెంకటాంపల్లె కు చెందిన నాగ తిమ్మయ్య మంగమ్మ దంపతుల కూతురు సుమలత తో 16.3.2024 తేదీన పెద్దల సమక్షంలో వివాహం జరిపించారు. వివాహం అయిన పది రోజులకే కుమారస్వామి తన భార్య సుమలత కోరిక మేరకు తల్లిదండ్రుల ఇంట్లోనే మిద్దె మీద పోర్షన్ లో వేరు కాపురం పెట్టాడు. అయినా కూడా కొత్త దంపతుల మధ్య అన్యోన్యత లేక గొడవలు జరుగుతూ వుండేవి. పెళ్లి జరిగిన నెలకే వారి మధ్య గొడవలు మొదలయ్యాయి.ఆరు నెలలకే పంచాయితీ జరిగినది.2024 డిసెంబర్ నెలలో సుమలత భర్తతో గొడవపడి ఇక కలిసి కాపురం చేయనని తండ్రిని పిలిపించుకుని తన పుట్టింటికి వెళ్ళిపోయింది. దాదాపు పది నెలల తర్వాత వెల్దుర్తి పోలీసు స్టేషనులో సుమలతనే ఫిర్యాదు చేయగా పోలీసు వారు కౌన్సెలింగ్ చేస్తుండగా మధ్యలోనే సుమలత వెల్దుర్తి మహిళా సంఘం నాయకులతో కలిసి రామళ్ళకోట గ్రామానికి వెళ్ళి ఇంటి తాళాలు పగులగొట్టి దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించినది. ఒకవైపు పోలీసులు కౌన్సెలింగ్ చేస్తుండగా మహిళలను తీసుకెళ్ళి ఊర్లో అల్లరి చేసి దౌర్జన్యంగా ఇంటి తాళాలు పగులగొట్టి మర్యాద తీసిన సుమలతతో నేను ఇక కాపురం చేయను అంటూ కుమారస్వామి తేల్చి చెప్పాడు. ఆ రోజు నుండి కుమారస్వామి ఇంటికి వెళ్ళడం లేదు. పెద్దలను కాదని వేరు కాపురం పెట్టుకుని గొడవలు పడిన భార్యాభర్తలకు ఏమీ చెప్పలేక సుమలత అత్త జయమ్మ , జయమ్మ భర్త వెంకటేశ్వర్లు మోనంగా వున్నారు. నా భర్త ఇంటికి వచ్చి కాపురం చేయకపోతే మీ అంతు చూస్తానని, మీరు ఎలా ప్రశాంతంగా కాపురం చేస్తారో చూస్తాను అని, మీ కాళ్ళు చేతులు విరగ్గొట్టి మిమ్మల్ని చంపుతాను, వాడిని మాత్రం వదిలిపెట్టను అంటూ సుమలత తన అత్తమామలను బూతులు తిట్టి వాళ్ళను ఇంట్లో నుండి బయటకు గెంటి వేసినది. కింద పోర్షన్ లో రెండవ కుమారుడు కోడలు కాపురం వుంటే వారిని కూడా భయ భ్రాంతులకు గురిచేసి ఇంట్లో నుండి బయటకు గెంటి వేసినది. అత్తింటి వారినందరిని ఇంట్లో నుండి బయటకు గెంటి వేసి సుమలత ఒక్కటే ఇంట్లో వుంటూ అత్త మామలను కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తున్నది. అంతే కాకుండా డోన్ లో వున్న ఆడబిడ్డ ఇంటికి వెళ్ళి ఆమెను కూడా బెదిరించినది. కోడలు పెట్టే మానసిక వేధింపులు భరించలేక సుమలత అత్త జయమ్మ కర్నూలు జిల్లా ఎస్.పి గారికి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసింది. న్యాయం చేస్తామని వెల్దుర్తి పోలీసులు ఎలాంటి న్యాయం చేయకుండా నిర్లక్ష్యం వహించారు. బాధితురాలు జయమ్మ ఆమె భర్త వెంకటేశ్వర్లు దాదాపు నాలుగు నెలలుగా కర్నూలులోని బంధువుల ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. వృద్దులయిన అత్తమామలను వాళ్ళ సొంత ఇంటి నుండి వాళ్ళను బయటకు గెంటి వేసిన కోడలు సుమలత యొక్క దౌర్జన్యాల పై మరియు ఆమెకు వత్తాసు పలుకుతూ జయమ్మ కుటుంబాన్ని వేధిస్తున్న రామళ్ళకోట గొల్ల నారాయణ లపై చట్టపరమైన చర్యలు చేపట్టి బాధితురాలు జయమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని పట్నం రాజేశ్వరి డిమాండ్ చేసారు.

# 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా టికెట్ కోసం ఉల్లెంగ నాగరాజు దరఖాస్తు



**ప్రజాబలం ప్రతినిధి:** నిజామాబాద్ జనవరి 16 ;ఉల్లెంగ నాగరాజు 47వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ టికెట్ కోసం మన నిజామాబాద్ అర్బన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ కు దరఖాస్తు చేసుకోవడం జరిగింది. మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి ఐన నాగరాజు బొబ్బిలి వీధి ఎల్లమ్మ గుట్ట మాజీ యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ జనరల్ సెక్రెటరీ గా పనిచేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు పి.ప్రదీప్ , కిరణ్ తదితరులు ఆయనకు మద్దర్టు ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన నిజామాబాద్ నాయకులకు, ప్రజలకు, 47 డివిజన్ ప్రజలకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

# 20 న భారతీయ జనతా పార్టీకి రానున్న కొత్త అధ్యక్షుడు




న్యూఢిల్లీ జనవరి 16 భారతీయ జనతా పార్టీకి కొత్త అధ్యక్షుడు రానున్నారు. ఈనెల 19వ తేదీ అధ్యక్ష పదవికి నామినేషన్ దాఖలు చేయనున్నారు. 20వ తేదీన పార్టీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారు. బీజేపీ జాతీయ రిటర్నింగ్ ఆఫీసర్ కే లక్ష్మణ్ ఆ ఎన్నికకు సంబంధించిన షెడ్యూల్‌ను రిలీజ్ చేశారు. జనవరి 19వ తేదీన మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల మధ్య నామినేషన్ దాఖలు చేసుకోవాలి. ఇక సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య నామినేషన్ విత్‌డ్రా చేసుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ అవసరం అయితే పోలింగ్ 20వ తేదీన నిర్వహించనున్నారు. ఆ రోజే కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటిస్తామన్నారు. అయితే పార్టీ వర్గాల ప్రకారం ప్రస్తుతం బీజేపీ జాతీయ తాత్కాలిక అధ్యక్షుడిగా ఉన్న నితిన్ నబిన్ ఆ పదవిని గెలుచుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జేపీ నడ్డా స్థానంలో నబిన్ ఆ బాధ్యతలు చేపట్టే ఛాన్సు ఉన్నది. నితిన్ నబిన్‌కు ప్రధాని మోదీ, ంమంత్రి అమిత్ షా అండ ఉన్నది.

# జనసంద్రంగా మారిన మేడారం జాతర.

**సంక్రాంతి సెలవులు రావడంతో భారీగా తరలివచ్చిన భక్తులు.**
**జంపన్న వాగులో పుణ్యస్నానాలు, అమ్మవార్లకు మొక్కుల చెల్లింపు.**
**పచ్చని ప్రకృతిలో కుటుంబ సమేతంగా జాతర ఆనందం**



**ప్రజాబలం ములుగు జిల్లా ప్రతినిధి జనవరి 16 :** సంక్రాంతి పండుగ ముగియడంతో మేడారం మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మేడారం జాతర భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. లక్షలాది మంది భక్తులు మేడారం చేరుకుని ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించేందుకు బంగారు బుట్టలను తలపై పెట్టుకొని గద్దల వద్దకు చేరుకున్నారు.తమ కోరికలను తీర్చే కొంగు బంగారంగా ప్రసిద్ధిగాంచిన శ్రీ సమ్మక్క-సారలమ్మ వనదేవతలకు భక్తులు వడి బియ్యం, బంగారం, చీర, సారె, పసుపు-కుంకుమతో పాటు బంగారాన్ని నైవేద్యంగా సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. అమ్మవార్ల దయతో తమ కుటుంబాలు సుఖశాంతులతో, పిల్లా పాపలు పాడిపంటలతో ఎల్లప్పుడూ ఆనందంగా ఉండాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.మొక్కులు చెల్లించిన అనంతరం భక్తులు కుటుంబ సమేతంగా కంక వనాల (వెదురు అడవులు) మధ్య ఉన్న పచ్చని ప్రకృతిలో వంటావార్పు చేసుకుని, పిల్లలతో కలిసి సంతోషంగా సమయం గడిపారు. జాతర ఆనందాన్ని మనసారా అనుభవించిన భక్తులు, అమ్మవార్ల కృపతో తిరిగి తమ ఇళ్లకు ప్రయాణమవుతూ మేడారం మహాజాతరను మరపురాని అనుభూతిగా మలుచుకున్నారు.





# ప్లాస్టిక్ నియంత్రణకు ముందడుగు:

## Switcheko

**స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా చక్రాలపై సుస్థిర అభివృది – Switcheko**

**మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 16:**జనవరి 11 నుండి 15 ఫిబ్రవరి, 2026 వరకు Switcheko వారు తెలంగణ ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న "స్వచ్ఛ భారత్ యాత్ర"



లో భాగంగా వికేంద్రీకృత మరియు వ్యర్థాల ప్రక్రియకు సంబందించిన సంచార వాహన పని తీరును మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం లో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ తో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ప్లాస్టిక్ బాటిల్స్ కుదింపునకు బెయిలింగ్ యంత్రం, సానిటరీ పాడ్స్ ఇన్సినరేటర్, బయో కవర్స్ కంపోస్టింగ్ మొదలగు సృజనాత్మక ప్రక్రియలను కలిగియున్న ఈ సంచార వాహన ప్రత్యేకతలను వివరణాత్మకంగా Switcheko టీం వారు జిల్లా అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అలాగే ఉద్యోగులచే స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు.
ఈ స్వచ్ఛ భారత్ యాత్రలో భాగంగా, ప్రతి రోజు 40 కి.మి నడిచి ప్లాస్టిక్ వ్యర్థాలను స్విచ్ఎక్కో టీం వారు సేకరిస్తారని, 12th INTERNATIONAL PLASTICS EXHIBITION, CONFERENCE CONVENTION - PLAST INDIA 2026 లో ఈ సంచార వాహనాన్ని ప్రదర్శనకు అందుబాటులో ఉంచుతారని స్విచ్ఎక్కో టీం వారు తెలిపారు.

## రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటిస్తే ప్రయాణం సురక్షితం
## – పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి

పెద్దపల్లి రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ ప్రయాణం సురక్షితం గా సాగించాలని పెద్దపల్లి డీసీపీ రామ్ రెడ్డి అన్నారు. ఇం దులో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అరైవ్ ?.. అలై వ్ కార్యక్రమం నిర్వహిస్తుంద న్నారు. ఇందులో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ఉత్తర్వుల మేరకు పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి పురపాలక సంఘంలోని ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, రోజు రోజుకు పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనే నని ఆయన తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు, ఇతర నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉప యోగించాలని సూచించా రు. అలాగే సెల్ ఫోన్ మాట్లాడు తూ డ్రైవింగ్ పరిపాటిగా మారిందన్నారు. చిన్న చిన్న నియమాలు ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే కీలక భద్రతా చర్యలని డీసీపీ వివరించారు. అధిక వేగం, మద్యం సేవించి వాహ నాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయ డం వంటి ప్రమాదకర అలవా ట్లను పూర్తిగా నివారించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాల ను తగ్గించవచ్చని తెలిపారు. ప్రతి వ్యక్తి సురక్షితంగా తన గమ్యస్థానానికి చేరుకోవడమే నని, ఇందుకోసం ప్రభుత్వ ఉద్యోగులు ముందుగా రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రజలకు ఆదర్శంగా నిలవాల ని డీసీపీ పిలుపునిచ్చారు.

# రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలి- జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి



**మేడ్చల్ – మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం జనవరి 16:**రోడ్డు ప్రమాదాల నివారణలో తెలంగాణ ప్రభుత్వం పది రోజుల పాటు నిర్వహించే »»Arrive Alive Campaign-2026" లో భాగంగా రెండవ రోజు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణం లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రోడ్డు భద్రత ప్రమాణాలను విధిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా డిఆర్వో, ఏసిపి, ట్రాఫిక్ ఎస్ఐ లతో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వాహనం కలిగియున్న ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, ఫిట్నెస్ పర్మిట్, పొల్యుషన్ చెక్, ఇన్సూరెన్స్ పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వెంకట రెడ్డి మాట్లాడుతూ పౌరుల పరివర్తన మరియు పౌర సమాజ అవగాహన రోడ్డు భద్రతలో కీలకమని అన్నారు. భారతదేశంలో కేవలం 2025 సం.కి గాను ఐదు లక్షల పైన రోడ్డు ప్రమాదాలు జరిగాయని, అందులో 2 లక్షల వరకు మరణాలు ఉన్నాయి అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిచిన సందేహాలను ఉద్యోగులకు నివృత్తి పరిచారు మరియు "రహదారి భద్రత ప్రతిజ్ఞ" ను ఉద్యోగులచే చేయించారు. అలాగే, షామీర్పేట్ సిఐ శ్రీనాథ్ మాట్లాడుతూ మనం చేసే చిన్న చిన్న నిర్లక్ష్యాలు హెల్మెట్ (స్ట్రాప్ ఫిక్స్ చేసుకోకపోవడం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం వలన మన కుటుంబాలకి తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తాయని అన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంక్ డ్రైవ్, రాంగ్ లేన్ డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే నష్టాలను వివరించారు. ట్రాఫిక్ ఎస్ఐ నవీన్ రెడ్డి మాట్లాడుతూ స్పీడ్ మరియు సేఫ్టీ ప్రమాణాలు అందరూ తెల్సుకొని మన చుట్టూ ఉన్న అందరికీ తెలియచెప్పడం ప్రభుత్వ ఉద్యోగులుగా మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖల అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తుంబూరు దయాకర్ రెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం)** తెలంగాణ రాష్ట్ర రెవిన్యూ శాఖ మాత్యులు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీస్ ఇన్ ఛార్జ్ తుంబురు దయాకర్ రెడ్డిని వారి కార్యాలయంలో మాజీ జెడ్పిటిసి డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాలలో ప్రశాంత వాతావరణం తో, ప్రతి ఒక్కరూ ముఖ్యంగా రైతన్నలు సంక్రాంతి పండుగ తో సహా ప్రతి ఒక్క ఉత్సవాలను ఆనందంతో గడుపుకోవాలని ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి తెలిపారు. అంతకుముందు మల్లి బాబు యాదవ్ దంపతులు పండితాపురం గ్రామంలో ని స్వగృహంలో అభిమానులు కార్యకర్తలు, కుటుంబ సభ్యుల సమక్షంలో సంక్రాంతి పండుగ సంబరాలు, గంగిరెద్దు ఆటలు జరుపుకున్నారు. రైతులకు సాంప్రదాయకరమైన ఈ సంక్రాంతి పండుగను పాడిపంటలతో, కుటుంబంతో, గంగిరెద్దుల ఆటలతో హరిదాసుల సంకీర్తనలతో పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ఈ పండుగ నుండి సూర్యుడు మకర రాశిలోకి, ఉత్తరాయణం నుండి దక్షిణాయనమునకు



ప్రవేశించే సందర్భమున జరిగే సంక్రాంతి పండుగ అందరి జీవితాలలో సంతోషం ఉండాలని మల్లి బాబు యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులకు రైతుబంధు ద్వారా డబ్బులు ఎకౌంట్లోకి జమ జరుగుతుందని, బీసీ ఎస్సీ ఎస్టీలకు కొత్తగా పథకాలు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమ్మనేపల్లి గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, శీలం పుల్లయ్య జక్కంపూడి వెంకటేశ్వర్లు, మేకల అన్నపూర్ణ మేకల మహేష్ బాబు, లీలా, కవిత మేకల లక్ష్మీనారాయణ ఎస్ కే రబ్బానీ పాషా దేరంగుల తిరపయ్య, రాధాకృష్ణ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు

# సంక్రాతి ముగ్గుల్లో మీమ్స్ ట్రెండ్




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**సంక్రాతి పండగ వేళ గ్రామాల్లో,సందడి నెలకొంది యువకులు గాలిపతాలు ఎగిరేసే పనిలో బిజీ గా ఉంటే ,మహిళలు వాకిట్లో రంగవల్లులు వేయడంలో బిజీ అయిపోయారు, ఇందులో భాగంగా ముగ్గులతో పాటూ సోషల్ మీడియా ను కూడా భాగంగా చేసుకున్నారు, మహిళలు, ఎప్పటికప్పుడు సోషల్ మీడియా ట్రెండ్ గా నిలుస్తున్న మీమ్స్ ని, సంక్రాతి ముగ్గుల్లో వేసి కొత్త ట్రెండ్ కి శ్రీకారం చుట్టారు, ఇటీవలే సోషల్ మీడియాలో ట్రెండ్ గా ఉన్న మీమ్స్, ఒడియమ్మ బంటి,రక్త పింజర్రోయ్,ఓహ్ మై గాడ్ ఫ్లాష్ మ్యాన్ లాంటి మీమ్స్, ముగ్గుల రూపంలో వేసి, నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు,ఏది ఏమైనా ఈ సోషల్ మీడియా మానవ జీవన శైలిపై, ఇంకెంత ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సిందే....

## ఎస్వీ గోశాలలో గోపూజ మహోత్సవం

తిరుపతిలోని ఎస్వీ గోశాలలో శుక్రవారం రోజు కనుమ పర్వదినాన్ని పురస్కరించుకుని గోపూజ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరిగింది. వేదమంత్రోచ్చారణల నడుమ గోమాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు పాల్గొని కనుమ పండుగను ఆధ్యాత్మికంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అనిల్ కుమార్ సింఘాల్ తదితరులు పాల్గొన్నారు.

# వురిమళ్ల సునందకు అలిశెట్టి సాహిత్య అవార్డ్ ప్రదానం

## పెద్దింటి అశోక్ కుమార్ చేతుల మీదుగా ఆంతర్యం కథా సంపుటి ఆవిష్కరణ



**ఖమ్మం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం)** ఖమ్మం అక్షర సూర్యుడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా జగిత్యాలలోని కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు అలిశెట్టి సాహిత్య అవార్డును ప్రముఖ కవయిత్రి, పాఠ్య పుస్తక రచయిత, కీర్తి పురస్కార గ్రహీత వురిమళ్ల సునంద కు ప్రదానం చేశారు. సాహిత్యంలో ఆమె చేస్తున్న విశేష సేవలకు గాను ఈ అవార్డ్ దక్కినట్లు పలువురు సాహితీవేత్తలు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయితలు పెద్దింటి అశోక్ కుమార్, కె.వి.నరేందర్ చేతుల మీదుగా సునంద రాసిన ఆంతర్యం కథా సంపుటి ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సాహితీ వేత్తలు, అభిమానులు పాల్గొన్నారు



# భీమన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు.

## దైవ దర్శనం కోసం బారులు తీరిన భక్తులు.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధాలయమైన శ్రీ భీమేశ్వరాలయంలో శుక్రవారం రోజున భక్తులతో కిక్కిరిసిపోయింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సమీపిస్తున్న సమయంలో తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా ఇతర రా(ష్ట్రాల నుండి సైతం భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణ పరిసరాలు మొత్తం భక్తులతో నిండిపోయినాయి. వేకువజాము నుండి భక్తులు తలనీలాలు సమర్పించుకొని , కుటుంబ సభ్యులతో పవిత్ర స్నానాలు ఆచరించి దైవ దర్శనం చేసుకొని,



కోడె మొక్కులు చెల్లించుకున్నారు. దైవదర్శనానికి భక్తులకు సుమారుగా రెండు గంటల సమయం పట్టింది. తరలివచ్చిన భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేసినారు.

# మృతి రాలుకుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి జనవరి 17(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పంచలింగాల్ గ్రామానికి చెందిన కర్నె అంబయ్య భార్య నాగమణి అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రాత్రి మృతి చెందింది,అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డి,ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాగమణి అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపగా స్థానిక మాజీ సర్పంచ్ ×సనగారి సురేందర్ రెడ్డిమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మనిలా సురేశ్ కుమార్ యాదవ్ తో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి నగదును అందజేశారు, ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, సర్పంచ్ కంటెస్టెంట్ అభ్యర్థి సురేశ్, మల్లా రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సంజీవ్ యాదవ్, ప్రవీణ్ గౌడ్, సామెల్, శివయ్య, భాగయ్య, గౌరయ్య, సంజీవ్, నర్సింహులు, కృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు..

# వేములవాడలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్, ఇన్చార్జి కలెక్టర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి కొలువై ఉన్న వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ కూడలిని అభివృద్ధి పరచడానికి శుక్రవారం రోజున వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్, రాష్ట్ర మంత్రి ధనసరి అనసూ యసీతక్క తో కలిసి భూమిపూజ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ వేములవాడ మున్సిపల్ పరిధిలో పట్టణాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను తగ్గించడంతోపాటు వేములవాడను సుందరమైన రూపాన్ని అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం కీలక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందులో భాగంగానే తిప్పాపూర్ బస్టాండ్ వద్ద ఒక కోటి రూపాయలతో జంక్షన్ అభివృద్ధి పనులను శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. వేములవాడ పట్టణాన్ని ఆదర్శవంతమైన పట్టణంగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని ఆయన పేర్కొన్నారు. జంక్షన్ సుందరీకరణతో పాటు విస్తరణ పనులు చేపట్టి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించడం, రాజన్న భక్తులు






మరియు వేములవాడ పట్టణ ప్రజలకు ప్రయాణ సౌలభ్యం కల్పించడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ప్రజలకు నిజమైన ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని, నిర్ణీత కాలపరిమితిలోగా తిప్పాపూర్ జంక్షన్ పన్నులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వేములవాడకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తాం

## మంత్రి గడ్డం వివేకానంద



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జనవరి 16 :** మంచిర్యాల జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార,గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.శుక్రవారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ రాజు, మందమర్రి మండల తహసిల్దార్ సతీష్,డి.సి.సి.అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి లతో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని, చెన్నూర్ నియోజకవర్గంలో ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేస్తూ అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు పథకం ఫలాలు అందించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకంలో ఇంటింటికీ నల్లా కనెక్షన్ ద్వారా నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 1వ వార్డు





అల్లూరినగర్‌లో 73 లక్షల 46 వేల రూపాయలు, 2వ వార్డు తిలక్‌నగర్‌లో 72 లక్షల 56 వేల రూపాయలు, 7వ వార్డులో 72 లక్షల 56 వేల రూపాయలు, 8వ వార్డు చైతన్య కాలనీలో 1 కోటి 89 లక్షల రూపాయలు, 9వ వార్డు ఆర్.ఆర్. నగర్‌లో 46 లక్షల రూపాయలు, న్యూ తిమ్మాపూర్‌లో 52 లక్షలు 50 వేల రూపాయలు, ఓల్డ్ తిమ్మాపూర్‌లో 44 లక్షల 50 వేల రూపాయలు, 12వ వార్డు గాంధీనగర్ ప్రాంతంలో 6 లక్షలు 17 వేల రూపాయలు, 13వ వార్డు ఆమ్‌నగర్ ప్రాంతంలో 6 లక్షల 17 వేల రూపాయలు, 14వ వార్డు మల్లికార్జున నగర్ ప్రాంతంలో 27 లక్షల 22 వేల రూపాయలు, 16వ వార్డు గంగా కాలనీలో 34 లక్షల 64 వేల రూపాయల అంచనా వ్యయంతో టి.యు.ఎఫ్.ఐ.డి.సి., డి.ఎం.ఎఫ్.టి., సి.ఎస్.ఆర్., నగర అభివృద్ధి నిధులతో పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని చెన్నూర్ నియోజకవర్గ పరిధిలో గల ప్రతి ప్రాంతాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో మంజూరైన అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులను ప్రణాళికబద్ధంగా వినియోగించి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వచ్చే వేసవిలో ప్రతి ఇంటికి నిరంతరం త్రాగునీటిని అందించేందుకు అమృత్ పథకం క్రింద నీటి ట్యాంకులు,ఇతర అనుబంధ పనులను చేపట్టి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చేందుకు అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గోల్కొండలో అట్టహాసంగా ప్రారంభమైన 'హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

**లాంఛనంగా ప్రారంభించి.. విహరించిన మంత్రి జూపల్లి**

**గగనతలంలో మంత్రి జూపల్లి సాహస యాత్ర**

**సుమారు గంటన్నర పాటు 13 కిలోమీటర్లు విహరించిన మంత్రి జూపల్లి**

**ఈ రైడ్ గొప్ప అనుభూతిని ఇచ్చిందన్న మంత్రి జూపల్లి**

**పర్యాటక రంగంలో కొత్త అధ్యాయం: మంత్రి జూపల్లి**

**సంస్కృతి - సాంకేతికతల సమ్మేళనం**

**డెస్టినేషన్ తెలంగాణ" బ్రాండ్ బలోపేతమే లక్ష్యం**

**దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించడమే ఉద్దేశ్యం**




**ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్, జనవరి 16 :** చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బలూన్ అప్పాజి గూడ శివారులో దిగింది.

ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ×. తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని మంత్రి అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్' ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని తెలిపారు.

డెస్టినేషన్ తెలంగాణ - ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "డెస్టినేషన్ తెలంగాణ" అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు (Adventure Sports) ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు.

ఇదొక అద్భుత అనుభూతి. సంప్రదాయానికి గౌరవం, సాంకేతికతకు స్వాగతం పలుకుతూ పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతాం. నేడు ఆకాశంలో ఎగురుతున్న ఈ బెలూన్లు.. తెలంగాణ పర్యాటక రంగం ప్రపంచ స్థాయి ఎత్తులకు చేరుకోబోతోంది అనడానికి నిదర్శనం" అని మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు.

కుటుంబ సభ్యులు, యువత, పిల్లలందరికీ ఈ ఫెస్టివల్ ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోతుందని, ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరక్టర్ క్రాంతి వల్లూరి, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు

# యువత క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామ సర్పంచ్ పరు శురాం, ఎండి కాజా, ఎండి పర్వేజ్, ఎండి షకిల్, ఎండి హమీద్, ఎండి అబ్బు, ఎండి ఇజాజ్, ఎండి రియాజ్, ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, కార్యక్రమానికి ముఖ్య అతిథులు మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్, , పాల్గొని పట్లూర్ అనుబంధ గ్రామమైన కట్టే పాడు తాండపక్కన గ్రౌండ్లో టవర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు,మొదటి బహుమతి 25000 వెయ్యిలు నగదు ఒకకప్పు రెండో బహుమతి 15000 వెయ్యిలు నగదు ఒక కప్పు ఇప్పటివరకు టోర్నమెంట్లో పాల్గొనడానికి అన్ని టీములు హాజరు కావడం జరిగింది గెలుపు ఓటమిసర్వసాధారణము కానీ యువత సమరస్యంగా సంతోషంగా ఆట పోటీల్లో పాల్గొని టోర్నమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మర్పల్లి మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ తెలిపారు, రోజు కూడా అన్ని టీములు సామరస్యంగా సంతోషంగా ఆటలో పాల్గొంటున్నారని, తెలిపారు ఆటల్లో మంచి క్రమశిక్షణ పట్టుదల ఉండాలి ముందు ముందు వారు మంచి విజయాలు సాధించాలని పట్లూర్ ట వర్నమెంట్ స్పాన్సర్ మరియు ,పట్లూర్ గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు....

## గాంధీ భవన్‌లో ఎస్. లజెపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి నివాళులర్పించిన కుమార్ రావు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** మాజీ కేంద్ర మంత్రి, దివంగత ఎస్. లజెపాల్ రెడ్డి జయంతిని పురస్కరించుకుని, గాంధీ భవన్‌లో ఆయన చిత్రపటానికి పుష్పగుచ్ఛాలు అర్పించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కుమార్ రావు , పీసీసీ జనరల్ సెక్రటరీ అల్లం భాస్కర్ , పీసీసీ కోఆర్డినేటర్ డా. ఎం.ఎస్. అంసారీ తో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుధర్శన్ రావు మరియు మణిలాల్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు దివంగత లజెపాల్ రెడ్డి దేశానికి మరియు భారత జాతీయ కాంగ్రెస్‌కు అందించిన అమూల్యమైన సేవలను, ఆయన దూరదృష్టి గల నాయకత్వాన్ని, ప్రజాసేవకు అంకితమైన జీవన ప్రయాణాన్ని స్మరించుకుంటూ హృదయపూర్వక నివాళులు అర్పించారు. ఆయన స్ఫూర్తిదాయక వారసత్వం ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు.

# రంగమ్మ గూడెం లో ఘనంగా ముగ్గుల పోటీ

## కాంగ్రెస్ పార్టీ వార్డ్ మెంబర్ వంగాల అవినాష్ ఆధ్వర్యంలో




యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కక్కిరేణి గ్రామపంచాయతీ రంగమ్మ గూడెం విలేజ్ లో కాంగ్రెస్ పార్టీ పదో వార్డు సభ్యులు వంగల అవినాష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు ఈ ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళలకి అవినాష్ కు తోచిన ఆర్థిక సహాయంతో మహిళలకు బహుమతి ప్రధానం అందజేయడం జరిగింది ఫస్ట్ ప్రైస్ మాంద్ర పూజ, సెకండ్ ప్రైస్ మద్దె గళ్ళ ఉమా ,థర్డ్ ప్రైస్ పల్సం సంతోష విజేతలుగా గెలుపొందారు అనంతరం అవినాష్ మాట్లాడుతూ రంగమ్మ గూడెం మహిళలు చైతన్యవంతులుగా ఎదగాలని రాబోయే రోజులలో మహిళలు ఉన్నత స్థాయికి రావాలని అన్నారు అవినాష్ ఆధ్వర్యంలో వారికి ప్రైస్ లు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ౦గార్డు శ్రీశైలం యాదవ్ రావడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముద్రబోయిన మల్లయ్య, వంగాల ఉపేందర్ ముద్రబోయిన ఆంజనేయులు, ముద్ర బోయిన లింగస్వామి మద్దె గళ్ళ శీను ,మద్దె గల్ల ఉప్పలయ్య కొంతమంది గ్రామ యువకులు.తదితరులు పాల్గొన్నారు

## మృతురాలు కుటుంబానికి బి ఆర్ ఎస్,పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహాయం



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి జనవరి 16 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండల పరిధిలోని పంచాలింగల్,గ్రామానికి చెందిన కర్నె నాగమణి ఆకస్మికంగా మరణించడం జరిగిందిఇట్టి విషయం పార్టీ నాయకులు ద్వారా తెలుసుకున్న బి ఆర్ ఎస్ పార్టీ మర్పల్లి మండల అధ్యక్షులు రావులపల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి,వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు అంత్యక్రియల కొరకు 5000/– రూపాయలుఆర్థిక సహాయం పంపడంతో పంచాలింగల్ సర్పంచ్ బి మహేందర్ మరియు మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు నరేష్ గౌడ్ మృతురాలు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారుఈకార్యక్రమంలో ప్రకాష్ ,నరేష్ ,అంజయ్య ,రాజు ,వినయ్ ,అంజయ్య ,అజయ్, విఠల్ రాములు,షబ్బీర్ ,తదితరులు పాల్గొన్నారు

## పల్నడులో వైసీపీ కార్యకర్త హత్య...

గుంటూరు, జనవరి 16 పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త మందా సాల్మన్ హత్యోదంతం పల్నాడులో ఉద్రిక్తలకు కారణం అ?యంది. గురజాల నియోజకవర్గం పిన్నెల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ కార్యకర్త మందా సాల్మన్ అనారోగ్యంతో ఉన్న తన భార్యను చూసేందుకు సొంత గ్రామానికి వచ్చిన సాల్మన్‌ను ప్రత్యర్థులు ఇనుప రాడ్లతో కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన మరణించడంతో పిన్నెల్లిలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ ఘటనను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ ప్రోత్సాహంతో జరిగిన రాజకీయ హత్యేనని ధ్వజమెత్తారు. సాల్మన్ హత్యపై స్పందిస్తూ వైఎస్ జగన్ ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేశారు. చంద్రబాబుకు పరిపాలించడానికి అర్హులేనా? రెడ్‌బుక్ రాజ్యాంగం ముసుగులో ఎంతమంది ప్రాణాలను బలితీసుకుంటారు అంటూ ప్రశ్నించారు. బాధితుడిపైనే తప్పుడు కేసులు పెట్టడం దారుణమని, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆయన ఆరోపించారు. రాజకీయ కక్షల కోసం సామాన్య పేదల ప్రాణాలను తీయడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని, ఈ హింసా రాజకీయాలకు చంద్రబాబు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జగన్ హెచ్చరించారు. పిన్నెల్లిలో పరిస్థితి అత్యంత భయానకంగా తయారైందని, కేవలం రాజకీయ విభేదాల కారణంగా వందలాది వైఎస్ఆర్ సీపీ కుటుంబాలు గ్రామాన్ని వదిలి పారిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానిక నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అండతోనే ఈ అరాచకాలు జరుగుతున్నాయని, పోలీసులు సైతం అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్నారని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ఆరోపించారు. గ్రామంలో భయానక వాతావరణం సృష్టించి ప్రతిపక్ష కార్యకర్తలను ఊళ్ల నుంచి తరిమివేస్తున్నారని, ఈ మారణకాండకు ముఖ్యమంత్రే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com